www.mudranews.in
సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
హైదరాబాద్
గురువారం, 05.02.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13
సంచిక: 105
పేజీలు: 12
వెల: రూ. 5
Published From: Hyderabad

# అఫ్గాన్‌పై విజయం..
## ఫైనల్‌కు భారత్



అండర్ 19 వరల్డ్ కప్ లో టీమ్ ఇండియా ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీ ఫైనల్లో అఫ్గాన్‌పై 7 వికెట్ల తేడాతో గెలిచింది. 41.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని 311 ఛేదించింది. జార్జ్(115) శతకంతో చెలరేగారు. వైభవ్ సూర్యవంశీ(68), ఆయుశ్ మాత్రే(62), విహాన్ మల్హోత్రా(38) అదరగొట్టారు. కుర్రాళ్లను కట్టడి చేయడంలో అఫ్గాన్ బౌలర్లు చేతులెత్తేశారు. నూరిస్తానీ 2, జద్రాన్ 1 వికెట్ మాత్రమే తీశారు. ఫిబ్రబరి 6న ఇంగ్లండ్-19తో ఫైనల్లో టీమిండియా19 తలపడనున్నాయి.

# సంజయ్.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేనే
## జగిత్యాల ఎమ్మెల్యేకు స్పీకర్ క్లీన్ చీట్



- ఈ నెల 19కి వాయిదాపడ్డ కడియం విచారణ
- బీఆర్‌ఎస్‌లోనే ఉన్నామన్న ఇద్దరు ఎమ్మెల్యేలు
- ఇప్పటికే 8 మంది ఎమ్మెల్యేలకు క్లియర్
- బీఆర్‌ఎస్ విప్ వస్తే మద్దతిస్తా

03

## కేసీఆర్ ఎలా
# జాతిపిత?
### మిర్యాలగూడ సభలో సీఎం రేవంత్ రెడ్డి

09




మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

- ఫోన్ ట్యాపింగ్ చేసినందుకా?
- భార్యాభర్తల మాటలు విన్నందుకా..
- పోలీసులు మంచోళ్లు కాబట్టే.. ముసుగులేసి తీసుకెళ్లలేదు
- మున్సిపల్ ఎన్నికల తర్వాత రైతు భరోసా
- తమ పాలన చూసి ఓటేయాలి

# రేవంత్ బినామీ సీఎం
### ఆయనను ఒకరు వెనక నుంచి నడిపిస్తున్నారు



మీడియా మీట్‌లో మాట్లాడుతున్న కేటీఆర్

- రెండేళ్లుగా ఆయన దొడ్డిదారిన ఆ కంపెనీకి నిధులు రిలీజ్
- త్వరలోనే ఆధారాలతో సహా బయటపెడతా
- కేంద్రం వెంటనే చర్యలు తీసుకోవాలి
- భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

03

దివాళా తీసిన కేఎల్‌ఎస్‌ఆర్‌కు రూ.6 వేల కోట్ల ప్రాజెక్టులా..?

# బరికి దూరం

| మున్సిపల్ సమరం మొదలు.. కాంగ్రెస్—బీజేపీ హోరు, బీఆర్‌ఎస్ సైలెంట్! | సీఎం రేవంత్ ప్రచారం స్టార్ట్ కాంగ్రెస్‌కు రెఫరెండంలా మున్సిపల్ ఎన్నికలు | ఒక్క వారం ప్రచారం అగ్రనేతలే రంగంలోకి దిగిన పోరు |
|---|---|---|




- ఢిల్లీ నుంచి దిగిన బీజేపీ చీఫ్.. 'ప్రత్యామ్నాయం మేమే' సంకేతం
- గల్లీ గల్లీ కాషాయ ప్రచారం.. జనసేన మద్దతుతో బీజేపీ ప్లాన్
- లైట్ తీసుకున్న బీఆర్‌ఎస్.. అగ్రనేతలు ఎందుకు దూరం?
- తేడా వస్తే బాధ్యత తప్పించుకునే వ్యూహమేనా గులాబీ మౌనం?
- సవాళ్లు—ప్రతిసవాళ్లు.. సెమీ ఫైనల్స్‌గా మారిన మున్సిపల్ పోరు
- అధికార బలం కాంగ్రెస్‌కు ప్లస్.. వ్యతిరేకత మైనస్ అవుతుందా?
- కౌన్సిలర్ల ఎన్నికలు కాదు.. తెలంగాణ రాజకీయ దిశను తేల్చే రెఫరెండం!

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి ఒక్క వారమే గడువు. నామినేషన్ల పర్వం అలా ముగిసిందో.. లేదో.. అధికార పార్టీ రంగంలోకి దిగింది. అదే బాటలో బీజేపీ మొదలుపెట్టింది. స్థానిక నేతలు కాకుండా ఢిల్లీ నుంచి కాషాయ దళపతి రాష్ట్రానికి వచ్చారు. ఈ ఎన్నికలు కీలకంగా మారడంతో.. కాంగ్రెస్, బీజేపీ అగ్రనేతలు బరిలోకి దిగారు. కానీ బీఆర్‌ఎస్ మాత్రం లైట్ తీసుకుంటోంది. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు కనిపిస్తున్నాయి. అధికార కాంగ్రెస్, దూకుడు మీదున్న బీజేపీ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అగ్రనేతలను రంగంలోకి దించగా, ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ మాత్రం స్థానిక నేతలకే బాధ్యత వదిలేసింది. 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు జరుగుతున్న ఈ ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీ తన పాలనకు ఒక రెఫరెం మిగతా 02లో

# పవన్ కళ్యాణ్ కాదు దిష్టి కళ్యాణ్
## పీకేకు తెలంగాణలో ఏం పని..?



- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- మున్సిపల్‌లో బీజేపీకి ఒరిగేది సున్నా
- మతం పేరుతో రాజకీయాలు అలవాటు
- ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

03

# గాంధీభవన్‌లో ఫిరాయింపు ఎమ్మెల్యేల సంసారం
## కేంద్రమంత్రి బండి సంజయ్



- రాష్ట్రంలో కాంగ్రెస్ రాజకీయ వ్యభిచారం
- పార్టీ మారినట్లు అన్ని ఆధారాలున్నా క్లీన్ చీట్ ఇస్తున్నారు
- మున్సిపాలిటీలకు కేంద్రం నిధులు

03

## దేశంలోనే తొలి
# బుల్లెట్ రైల్ హబ్‌గా శంషాబాద్
### హైదరాబాద్ నుంచి ముంబై, బెంగళూరు, చెన్నై హైస్పీడ్ కారిడార్లను కలిపే జంక్షన్

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** శంషాబాద్.. భారతదేశ తొలి బుల్లెట్ రైలు హబ్‌గా మారనుంది. హైదరాబాద్ నుంచి ముంబై, బెంగళూరు, చెన్నై హైస్పీడ్ కారిడార్లను కలిపేలా ఈ ప్రాంతం కీలక పాత్ర పోషించనుంది. దక్షిణ భారత రాష్ట్రాల్లో రవాణాతో పాటు ఐటీ, ఆర్థిక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును రూపొందించింది. ఈ హైస్పీడ్ రైలు కారిడార్ల ప్రాజెక్టు పనులు 2027–2028 నాటికి పట్టాలెక్కే అవకాశాలు కనిపిస్తు మిగతా 02లో



- బెంగళూరు-చెన్నైలతోపాటు మహారాష్ట్ర పూణే నగరానికి పరుగు
- ప్రజారవాణాకు ఇబ్బందులు లేకుండా ఎలివేటెడ్ కారిడార్లుగా నిర్మాణం
- 2027-2028 నాటికి పట్టాలెక్కే అవకాశాలు
- తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాలకు తక్కువ సమయం

# ఫిలిం ఇండస్ట్రీకి కేంద్రంగా హైదరాబాద్
## బ్లూ ప్రింట్ ఏర్పాటుకు కసరత్తు

- సమాజం కోసం, కళల ద్వారా జీవితాన్ని త్యాగం చేసిన మహానుభావుడు గద్దర్
- 6 నుంచి గద్దర్ సినిమా అవార్డుల స్క్రీనింగ్
- ఉగాది పండుగ రోజు ఘనంగా కార్యక్రమం
- గద్దర్ ఫిలిం అవార్డుల జ్యూరీ సభ్యుల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి



సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** హైదరాబాద్ నగరాన్ని దేశవ్యాప్తంగా ఫిలిం ఇండస్ట్రీకి కేంద్రంగా చేయాలనే కృతనిశ్చయంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బాంబే, కలకత్తా, చెన్నై వంటి పట్టణాల్లో సినీ ఇండస్ట్రీ మిగతా 02లో

# యువ మహిళా న్యాయవాది హత్య
## భూ వివాదమే కారణం!



- అన్న చేతుల మీదుగా చెల్లి హత్య
- ప్రత్యేక బృందాలతో పోలీసుల విచారణ
- చేవెళ్ల కోర్టు విధులు బహిష్కరించిన లాయర్లు
- రాష్ట్రవ్యాప్తంగా న్యాయవర్గాల్లో ఆందోళన

10

# హైదరాబాద్ మెట్రో ఫేజ్–2కు గ్రీన్ సిగ్నల్
## 76.4 కిలోమీటర్ల విస్తరణకు డీపీఆర్ సిద్ధం

10

- 5 కొత్త కారిడార్లతో నగర రవాణాలో కొత్త అధ్యాయం
- అంచనా వ్యయం రూ. 24 వేల కోట్లు
- నాగోల్-శంషాబాద్, రాయదుర్గం-నియోపోలిస్ కీలక మార్గాలు
- పాతబస్తీకి మెరుగైన కనెక్టివిటీ.. ఎంజీబీఎస్–చాంద్రాయణగుట్ట కారిడార్
- మియాపూర్-పటాన్‌చెరు, ఎల్‌బీ నగర్-హయత్‌నగర్ వరకు రెడ్ లైన్
- శివార్ల వరకు మెట్రో చేరితే మధ్యతరగతి ఉద్యోగులకు భారీ ఊరట



# బీజేపీ హిందుత్వ రాజకీయం చేయదు



- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్
- అభివృద్ధే మా పార్టీ అజెండా
- సోనియా.. రేవంత్ కన్నా నాకే దగ్గర

03



# పాత్రికేయుల జీవితాలే పాఠాలు
## 10 మంది ప్రఖ్యాత జర్నలిస్టులపై మోనోగ్రాఫ్‌ల ఆవిష్కరణ

10

పాత్రికేయ రంగంలో తమ అక్షరాన్ని ఆయుధంగా మార్చుకొని సమాజానికి దిశా నిర్దేశం చేసిన 10 మంది జర్నలిస్టుల జీవిత విశేషాలను చిరు పుస్తకాలుగా భవిష్యత్ తరాలకు అందించే ప్రయత్నానికి తెలంగాణ మీడియా అకాడమీ శ్రీకారం చుట్టింది. హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో విధానమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే.కేశవరావు చేతుల మీదుగా ఈ మోనోగ్రాఫ్‌లను ఆవిష్కరించారు.

# వాట్ నెక్స్ట్?
## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు

- సప్లిమెంటరీ చార్జ్ షీట్‌కు సిట్ సిద్ధం
- ఐదు గంటల విచారణ తర్వాత ఉత్కంఠ..
- కేసీఆర్ పేరు చేర్చే అవకాశమా?
- రాజకీయ నిఘా నుంచి వసూళ్ల వరకు.. సిట్ ఆరోపణలు సంచలనం
- టెక్నికల్ ఆధారాలే కీలకం.. చట్ట ఉల్లంఘనపై సిట్ ఫోకస్

02



ఫోన్ ట్యాపింగ్ కేసు ఇప్పుడు కీలక మలుపు తిరిగింది. సిట్ దర్యాప్తు దాదాపు ముగింపు దశకు చేరుకోగా, తదుపరి అడుగు ఏమిటన్న ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో పెరుగుతోంది. మాజీ సీఎం కేసీఆర్ విచారణతో ఒక అధ్యాయం ముగిసినా, అసలు పరీక్ష మాత్రం ఇప్పుడే మొదలైందన్న సంకేతాలు వెలువడుతున్నాయి.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 05.02.2026
www.mudranews.in | @mudranews



పాపికొండలు గోదావరి



సహజ సౌందర్యానికి ప్రతీకగా నిలిచిన పర్యాటక కేంద్రం. నదీ విహారాలు, అటవీ జీవవైవిధ్యంతో ప్రసిద్ధి.

## ఫిలిం ఇండస్ట్రీకి కేంద్రంగా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

పెరగడానికి అంతగా అవకాశాలు లేవన్నారు. కానీ దేశంలో ఉన్న అన్ని భాషల ఇండస్ట్రీ హైదరాబాద్ లో విస్తరించడానికి సానుకూల అంశాలు అనేకంగా ఉన్నాయని ఆయన తెలిపారు. సకల భాషల సినీ ఇండస్ట్రీ, హైదరాబాద్ కు తరలి వస్తే రాష్ట్ర యువతకు, టెక్నీషియన్స్, రైటర్స్, డైరెక్టర్లకు ఉపాధి లభిస్తుందని అభిప్రాయపడ్డారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో గద్దర్ సినిమా అవార్డుల జ్యూరీ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. తమ పాలనలోనే హైదరాబాద్ సినీ ప్రపంచ మార్కెట్ కు కేంద్రంగా మారుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్లూ ప్రింట్ ప్రభుత్వం తయారు చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం కొన్ని దశాబ్ద కాలం పాటు సినిమా రంగానికి సంబంధించిన అవార్డుల విషయంలో నిర్లక్ష్యం వహించి వదిలేసిందన్నారు. సమాజంలో అత్యంత ప్రభావం చూపే సామాజిక పరివర్తన తీసుకొచ్చే సినీ రంగాన్ని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అవార్డులు ఇచ్చి తిరిగి ప్రోత్సహించడం ప్రారంభించిందన్నారు. సమాజం కోసం కళల ద్వారా తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహనీయుడు గద్దర్ అని డిప్యూటీ సీఎం తెలిపారు. తెలంగాణ అంటే కళలు, విప్లవం, ప్రశ్నించడం, సున్నిత మనసుతో, ప్రేమానురాగాలతో కూడినదని చెప్పారు. తెలంగాణ కళలు, సంస్కృతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి గద్దర్ అని తెలిపారు. అందుకే వారి పేరు మీద గతేడాది నుంచి సినిమా అవార్డులను ఇస్తున్నట్లు వివరించారు. తద్వారా సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకతలే ప్రమాణంగా సినిమా అవార్డుల ఎంపిక ఉంటుందన్న భట్టి... గతేడాది జ్యూరీ సభ్యులు అవార్డుల ఎంపికను గొప్పగా నిర్వహించి అభినందనలు పొందిన విషయాన్ని గుర్తు చేశారు. సినీ రంగ ప్రముఖులకు ఉన్న అనుభవాన్ని, నిబద్ధతను, సినిమా రంగంపై వారికున్న అభిమానాన్ని దృష్టిలో పెట్టుకుని ఎఫ్ డి సి ద్వారా అందరితో సంప్రదింపులు జరిపి జ్యూరీ సభ్యులుగా ఎంపిక చేశారన్నారు. ప్రభుత్వం నుంచి కావలసిన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందజేస్తామని తెలిపారు. ప్రతి పని సమాజానికి ఉపయోగపడాలని ప్రజలకు జవాబు దారిగా ఉండాలన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. గద్దర్ అవార్డులు ఎంపిక చేసే సినిమాల్లో కమర్షియల్ అంశంతో పాటు సామాజిక సందేశం తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్త తీసుకుంటే రాబోయే రోజుల్లో సమాజంలో మంచి సినిమాలను ప్రోత్సహించేందుకు అవకాశం ఉంటుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈనెల 6 నుంచి గద్దర్ సినిమా అవార్డుల స్క్రీనింగ్ కార్యక్రమం ప్రారంభమవుతుంది 19న ఉగాది పండుగ రోజు గద్దర్ అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని తెలిపారు. గద్దర్ అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా, ప్రపంచ వ్యాప్తంగా ఓ గొప్ప సందేశం ఇచ్చేలా నిర్వహించినట్లు వివరించారు. ఈ ఏడాది కూడా అదే రీతిలో పెద్ద ఎత్తున గద్దర్ అవార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించేందుకు ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్, ఐ అండ్ పీ ఆర్ శాఖలకు పూర్తి స్వాతంత్రం, అవసరమైన సహాయం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, ఐఅండ్ పీ ఆర్ కమిషనర్ ప్రియాంక, ఎఫ్ డిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాబుతో పాటు సినీ ప్రముఖులు తనికెళ్ల భరణి, కెఎస్ రామారావు, రోజా రమణి, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## బరికి దూరం

(మొదటి పేజీ తరువాయి)

దంగా భావిస్తోంది. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాల్లో పర్యటిస్తూ ప్రచారాన్ని హోరెత్తించాలని నిర్ణయించారు. పట్టణ ఓటర్లను ఆకట్టుకునేందుకు వరాల జల్లు కురిపిస్తూ, మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా తన పట్టును నిరూపించుకోవాలని చూస్తున్నారు. కేడర్‌లో ఉత్సాహం నింపేలా ప్రతి మున్సిపాలిటీకి మంత్రులను ఇన్–ఛార్జులుగా నియమించి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం ఉమ్మడి నల్గొండ జిల్లా మిర్యాలగూడలో ప్రచారం మొదలుపెట్టారు.

**ప్రచారానికి వచ్చిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు**

బీజేపీ సైతం ఏమాత్రం తగ్గడం లేదు. జాతీయ అధ్యక్షుడు స్వయంగా ప్రచారానికి వస్తుండటమే కాకుండా, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ వంటి వారు గల్లీ గల్లీ తిరుగుతున్నారు. వీటికి అదనంగా, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రెండు రోజుల పాటు తెలంగాణలో బీజేపీ అభ్యర్థుల తరపున ప్రచారం చేయనుండటం ఆ పార్టీకి పెద్ద ప్లస్ పాయింట్‌గా మారింది. జనసేన మద్దతుతో సెటిలర్ల ఓట్లను, యువత ఓట్లను గంపగుత్తగా కొల్లగొట్టాలన్నది బీజేపీ వ్యూహం. ఇంతటి భారీ యంత్రాంగాన్ని దింపడం ద్వారా రాష్ట్రంలో తామే ప్రత్యామ్నాయం అనే సంకేతాన్ని ఆ పార్టీ పంపిస్తోంది.

**పట్టించుకోని బీఆర్ఎస్**

ఈ హడావుడి మధ్య బీఆర్ఎస్ తీరు రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. గతంలో ప్రతి చిన్న ఎన్నికనూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకునే అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు ఈసారి ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. కేవలం ప్రెస్ మీట్లకే పరిమితం అవుతూ, క్షేత్రస్థాయి ప్రచార బాధ్యతలను స్థానిక ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్–ఛార్జులకే వదిలేశారు. అభ్యర్థుల ఎంపిక కూడా వారికే ఇచ్చారు. దీనివల్ల పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన స్తబ్దత నెలకొంది.

**తేడా వస్తే బాధ్యత తీసుకోకుండానేనా?**

బీఆర్ఎస్ ఈ ఎన్నికలను లైట్ తీసుకోవడం వెనుక లోతైన రాజకీయ కారణాలు ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఎన్నికల్లో ఫలితాలు తారుమారైతే, ఆ ఓటమి బాధ్యతను తమపై వేసుకోకుండా తప్పించుకోవడానికే అగ్రనేతలు దూరంగా ఉంటున్నారన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఎమ్మెల్యేలకు బాధ్యతలు అప్పగించడం ద్వారా.. ఫలితాలు బాగుంటే పార్టీ పుంజుకుందన్న ప్రచారం, తేడా వస్తే స్థానిక నేతల వైఫల్యంగా చూపించే వీలుంటుందని పార్టీ పెద్దలు భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఇది కార్యకర్తలను నిరుత్సాహానికి గురిచేస్తోంది. కాంగ్రెస్ తన అధికారాన్ని నిలబెట్టుకోవడానికి, బీజేపీ తన బలాన్ని నిరూపించుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతుంటే.. బీఆర్ఎస్ మాత్రం డిఫెన్సివ్ మోడ్‌లో కనిపిస్తోంది.

**సవాళ్లు.. ప్రతి సవాళ్లు**

మున్సిపల్ ఎన్నికల నగారా మోగిన వెంటనే రాష్ట్ర రాజకీయాల్లో సవాళ్లు, ప్రతిసవాల్‌లతో వాతావరణం వేడెక్కింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ ఎన్నికలను సెమీ ఫైనల్స్ గా అభివర్ణించగా, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఏకంగా కాంగ్రెస్ పాలనపై రెఫరెండం గా స్వీకరిద్దామని సవాల్ విసిరారు. మరోవైపు, పట్టణ ఓటర్లపై గట్టి నమ్మకంతో ఉన్న బీజేపీ.. మెజార్టీ స్థానాలు కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేస్తోంది.

**అధికార బలమే ప్లస్.. వ్యతిరేకతే మైనస్**

ప్రస్తుతం అధికారంలో ఉండటం కాంగ్రెస్‌కు ఉన్న అతిపెద్ద ప్లస్ పాయింట్. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని, పెంచిన పెన్షన్లు, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు పట్టణ ప్రాంత పేదలను ఆకట్టుకుంటాయని పార్టీ భావిస్తోంది. మంత్రి పొంగులేటి రెఫరెండం సవాల్ విసిరారంటే, ప్రభుత్వంపై వ్యతిరేకత లేదని వారు గట్టిగా నమ్ముతున్నారు. అయితే, రైతు భరోసా పంపిణీలో జాప్యం, పట్టణాల్లో అభివృద్ధి పనులపై వస్తున్న విమర్శలు పట్టణ మధ్యతరగతి ఓటర్లలో కొంత వ్యతిరేకతను పెంచే అవకాశం ఉంది. ఒకవేళ ఇక్కడ ఓడిపోతే, అది ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనంగా మారుతుంది.

**ఉనికి కోసమే పోరాటం**

కేటీఆర్ ఈ ఎన్నికలను సెమీ ఫైనల్స్‌గా పేర్కొనడం వెనుక వ్యూహం ఉంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఓటములతో డీలా పడ్డ కార్యకర్తల్లో ఉత్సాహం నింపాలంటే ఈ విజయం వారికి అనివార్యం. కేసీఆర్ హయాంలో జరిగిన పట్టణాభివృద్ధి, ఐటీ పురోగతి తమకు ప్లస్ అవుతాయని గులాబీ దళం ఆశిస్తోంది. అయితే, పార్టీ నుంచి కీలక నేతలు వలస వెళ్లడం, హైకమాండ్ లోపల కుటుంబ విభేధాలు బహిర్గతం కావడం ఈ పార్టీకి పెద్ద మైనస్ పాయింట్లు. ఈ ఎన్నికల్లో కూడా వెనుకబడితే, పార్టీ భవిష్యత్తు మరింత ఇరకాటంలో పడుతుంది.

**పట్టణ ఓటు బ్యాంకే కొండంత అండ**

తెలంగాణలో బీజేపీకి పట్టణ ప్రాంతాల్లో సహజంగానే బలమైన ఓటు బ్యాంకు ఉంది. ప్రధాన నగరాల్లో హిందూత్వ కార్డు , కేంద్ర ప్రభుత్వ పథకాలు ఆ పార్టీకి ప్లస్ పాయింట్లు. మున్సిపాలిటీల్లో తమదే మెజార్టీ అని బండి సంజయ్, కిషన్ రెడ్డి ధీమాగా ఉండటానికి కారణం ఇదే. అయితే, రాష్ట్ర స్థాయిలో బలమైన నాయకత్వం లేకపోవడం, జనసేన వంటి మిత్రపక్షం ఒంటరిగా పోటీ చేయడం వల్ల ఓట్లు చీలిపోవడం బీజేపీకి మైనస్ కావచ్చు.

**ఏం తేలుతోంది..?**

ఈ ఫలితాలు కాంగ్రెస్‌కు అనుకూలంగా వస్తే రేవంత్ రెడ్డి నాయకత్వానికి తిరుగులేదని తేలిపోతుంది. ఒకవేళ బీఆర్ఎస్ పుంజుకుంటే, కేసీఆర్ మార్క్ రాజకీయం ఇంకా ఉనికిలో ఉందని అర్థమవుతుంది. బీజేపీ గెలిస్తే, వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు తామే ప్రత్యామ్నాయమని ఢిల్లీకి సంకేతం పంపినట్లవుతుంది. ఫలితాలు తారుమారైతే, ఓడిన పార్టీల నుంచి వలసలు మరింత పెరిగి, ఆయా పార్టీల్లో తీవ్ర నీరసం ఆవరించే ప్రమాదం ఉంది. మున్సిపల్ ఎన్నికలు కేవలం కౌన్సిలర్లను ఎన్నుకునే ప్రక్రియ మాత్రమే కాదు.. తెలంగాణలో రాబోయే రాజకీయ దిశను నిర్దేశించే అతిపెద్ద పోలింగ్ రెఫరెండం గా మారబోతున్నాయి.

## దేశంలోనే తొలి బుల్లెట్ రైల్ హబ్‌గా శంషాబాద్

(మొదటి పేజీ తరువాయి)

న్నాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు పెద్దపీట వేసింది. హైదరాబాద్ కేంద్రంగా చెన్నై, బెంగళూరు, పూణే నగరాలకు బుల్లెట్ రైలు ప్రాజెక్టును ప్రతిపాదించి తీపి కబురు చెప్పింది. ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్‌లోని శంషాబాద్ దశ తిరిగిపోనుంది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో ఇప్పటికే దేశంలోనే అతి పెద్ద ఎయిర్‌పోర్టు కలిగి ఉన్న శంషాబాద్.. ఇప్పుడు బుల్లెట్ రైలు హబ్‌గా మారనుంది. ఇక ఈ ప్రతిపాదిత శంషాబాద్ బుల్లెట్ రైలు హబ్ నుంచి దక్షిణ భారతదేశంలో కీలక నగరాలైన బెంగళూరు, చెన్నైలతోపాటు మహారాష్ట్రలోని పూణే నగరానికి కూడా బుల్లెట్ రైళ్లు పరుగులు తీయనున్నాయి. బెంగళూరు, చెన్నై, పూణే నగరాలను కలిపే బుల్లెట్ రైళ్లు.. హైదరాబాద్ కేంద్రంగా నడవనున్నాయి. ఈ బుల్లెట్ రైళ్లు రావడంతో ఈ నగరాల మధ్య రవాణా మాత్రమే కాకుండా.. ఆర్థికంగా, ఐటీ రంగాలు భారీగా అభివృద్ధి చెందుతాయని భావిస్తున్నారు. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు రెండున్నర గంటలు.. చెన్నైకి 2 గంటలు.. పూణేకు ఒకటిన్నర గంటల్లోనే చేరుకోవచ్చు. ఇక శంషాబాద్‌లో నిర్మించబోయే ఈ త్రీ వే బుల్లెట్ రైలు టెర్మినల్ ద్వారా.. నాలుగు ప్రధాన మెట్రో నగరాలైన హైదరాబాద్, పూణే, చెన్నై, బెంగళూరులకు వేగవంత ప్రయాణం సాధ్యం కానుంది.

ఇది విమాన ప్రయాణానికి ప్రత్యామ్నాయంగా, మరింత తక్కువ ఖర్చుతో కూడిన ప్రయాణాన్ని అందిస్తుందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. హైదరాబాద్–బెంగళూరు..హైదరాబాద్–చెన్నై.. హైదరాబాద్–పూణే.. పూణే–ముంబై మార్గాల్లో బుల్లెట్ రైళ్లు పరుగులు పెట్టనున్నాయి. హైదరాబాద్–బెంగళూరు బుల్లెట్ రైలు.. మహబూబ్‌నగర్, కర్నూలు, అనంతపురం మీదుగా కేవలం 2 గంటల్లోనే గమ్యస్థానాన్ని చేరుకోవచ్చు. ఇక హైదరాబాద్–చెన్నై బుల్లెట్ రైలు కారిడార్.. నల్గొండ, అమరావతి, నెల్లూరు మీదుగా రెండున్నర గంటల్లో చేరుకునే అవకాశం కలగనుంది. హైదరాబాద్–పూణే బుల్లెట్ రైలు కారిడార్.. లింగంపల్లి, వాడి, సోలాపూర్ మీదుగా ఒకటిన్నర గంటల్లోనే చేరుకోవచ్చు. ఇక ఇదే హైదరాబాద్–పూణే కారిడార్ పొడగింపులో భాగంగా.. పూణే నుంచి ముంబైకి కేవలం ఒకే గంటలో చేరుకోవచ్చు. ఈ బుల్లెట్ రైళ్లు గంటకు 350 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించనున్నాయి. ఈ బుల్లెట్ రైలు ప్రాజెక్టులో భాగంగా భూసేకరణ సమస్యల ఎదురుకాకుండా ఉండేందుకు.. ఆయా మార్గాల్లో ఉన్న గ్రామాల మధ్య రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఈ మొత్తం మార్గాలను ఎలివేటెడ్ కారిడార్లుగానే నిర్మించనున్నారు. అయితే ఈ బుల్లెట్ రైలు ప్రాజెక్టు పనులు 2027–2028 నాటికి పట్టాలెక్కే అవకాశాలు ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

**నిధుల సమీకరణ సవాల్**

ఈ బుల్లెట్ రైలు ప్రాజెక్టు నిర్మాణానికి నిధుల సమీకరణ అనేది కేంద్ర ప్రభుత్వానికి ప్రధాన సవాల్‌గా మారనుంది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న దేశంలోనే మొట్టమొదటి బుల్లెట్ రైలు ప్రాజెక్టు అయిన ముంబై–అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్టు తరహాలో జపాన్ సంస్థ సాయం కాకుండా.. ఈ ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వంతోపాటు.. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు భరించాల్సి ఉంటుంది. ఇక ఇదే మోడల్‌లో ఈ ప్రాజెక్టును నిర్మించాలని భావిస్తే.. అందుకు తెలంగాణ ప్రభుత్వం రూ. వేల కోట్ల వాటాను తమ వంతుగా కేంద్ర ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. అయితే.. ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ విధానం) ద్వారా కూడా ఈ బుల్లెట్ ప్రాజెక్టును చేపట్టే అవకాశాలను కూడా కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది.



## వాట్ నెక్స్ట్?

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ఇప్పటి వరకు అన్ని అంశాలను పరిశీలించింది. ఇటు సాక్షులు.. అటు అనుమానితులు అందర్నీ ప్రశ్నించారు. చివరకు ఇప్పుడు సిట్ ఎదుట కీలకమైన సవాళ్లు ఉన్నాయి. అయితే, ఈ కేసు ఇప్పుడు నిర్ణయాత్మక దశకు చేరు కుంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించడంతో ఈ కేసులో ప్రధాన అంకం ముగిసింది. తర్వాత సిట్ ఏమి చేయబోతోందన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు. కానీ సిట్ కు అస లు సవాల్ ఇప్పుడే ప్రారంభమైందన్న భావన వినిపిస్తోంది. దీనిపై త్వరలోనే సప్లిమెంటరీ చార్జ్ షీట్ దాఖలు చేసేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది.

**కేసీఆర్ విచారణలో ఏం చెప్పారు?**

ఆదివారం కేసీఆర్ నివాసంలో సుమారు ఐదు గంటల పాటు సాగిన సిట్ విచారణ ఈ కేసులో కీలక మలుపు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తన ప్రభుత్వానికి తెలియకుండానే జరిగిందని, చట్టబద్ధమైన నిఘాకు, అక్రమ ట్యాపింగ్‌కు తేడా ఉందని కేసీఆర్ వాదించినట్లు తెలుస్తోంది. అయితే, సిట్ అధికారులు ఆయన ముందు ఉంచిన సాంకేతిక ఆధారాలు ఈ కేసును మరింత ఆసక్తికరంగా మార్చినట్లుగా చెబుతున్నారు. ముఖ్యంగా ప్రభాకర్ రావు వంటి అధికారుల పునర్నియామకం, రాజకీయ నేతలతో పాటు న్యాయమూర్తులు, వ్యాపారులు.. హరీష్ రావు ఫోన్లు ట్యాప్ చేయడంపై అధికారులు సంధించిన ప్రశ్నలకు సంధించినట్లుగా చెబుతున్నారు.



**సిట్ చెప్పుతున్నదేమిటి..?**

ఈ కేసు కేవలం రాజకీయ నిఘాకే పరిమితం కాలేదనేది సిట్ అధికారుల ప్రధాన ఆరోపణ. ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారాన్ని ఆసరాగా చేసుకుని కొందరు పారిశ్రామికవేత్తలను భయపెట్టి భారీగా వసూళ్లకు పాల్పడ్డారని, ఇందులో ఒక పోలీస్ మాఫియా పనిచేసిందని దర్యాప్తులో వెల్లడైంది. బీఆర్ఎస్ పార్టీకి వచ్చిన ఎలక్టోరల్ బాండ్ల విరాళాలకు, ఈ ట్యాపింగ్ బెదిరింపులకు ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో సిట్ ఆరా తీస్తోంది. రాజకీయ అధికారాన్ని ఉపయోగించి వ్యక్తిగత గోప్యతను హరించడమే కాకుండా, దాన్ని ధనార్జనకు వాడుకోవడం ఈ కేసులో అత్యంత తీవ్రమైన అంశం. దర్యాప్తు అధికారుల ముందున్న అతిపెద్ద సవాల్.. ధ్వంసమైన ఆధారాలను పునరుద్ధరించడం. నిందితులు హార్డ్ డిస్క్‌లను మూసీ నదిలో పడేయడం, కీలక డేటాను డిలీట్ చేయడం ద్వారా కుట్రను కప్పిపుచ్చే ప్రయత్నం చేశారని ఇప్పటికే గుర్తించారు. తాజాగా అందిన ఫోరెన్సిక్ నివేదికలు. క్లౌడ్ డేటా రికవరీ ద్వారా సిట్ కొన్ని కీలక ఫైళ్లను వెలికి తీసినట్లుగా చెబుతున్నారు. ఈ సాంకేతిక ఆధారాలను కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు వంటి నేతల వాంగ్మూలాలతో సరిపోల్చి పక్కాగా చార్జిషీట్ రూపొందించాలని సిట్ భావిస్తోంది.

**సప్లిమెంటరీ చార్జ్ షీట్**

దాదాపు అన్ని కోణాల్లో సిట్ విచారణ ముగిసినట్లుగా మారింది. కొన్ని వాంగ్మూలాలు రికార్డు చేశారు. అధికారులపై కేసు నమోదు చేసి జైలుకు పంపారు. వారికి బెయిల్ వచ్చింది. రాజకీయ నేతలకు నోటీసులు ఇచ్చారు. విచారణకు పిలిచారు. చివరకు మాజీ సీఎం కేసీఆర్ ఇంటికి వెళ్లి విచారణ చేశారు. అయితే, న్యాయస్థానంలో కేవలం నిందితులు లేదా సాక్షుల వాంగ్మూలాలు నిలబడవు. టెలిగ్రాఫ్ చట్టం, టీ చట్టాల ప్రకారం నిబంధనలు ఎలా ఉల్లంఘించారో శాస్త్రీయంగా నిరూపించాల్సి ఉంటుంది. ఎవరి అనుమతితో ట్యాపింగ్ జరిగింది.. అనుమతి లేని నంబర్లను ఎందుకు మానిటర్ చేశారు అనే ప్రశ్నలకు సిట్ ఇచ్చే సమాధానాలే ఈ కేసు భవితవ్యాన్ని నిర్ణయిస్తాయి. ఇప్పటికే ఆరుగురు అధికారులపై మొదటి చార్జిషీట్ దాఖలు చేసిన పోలీసులు, ఇప్పుడు కుట్ర' కోణంలో సప్లిమెంటరీ చార్జిషీట్ వేయనున్నారు. ఇందులో కేసీఆర్ పేరును నిందితుడుగా చేరుస్తారా లేక సాక్షిగా ఉంచుతారా అన్నది సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది. ఒకవేళ నేరపూరిత కుట్రలో ఆయన ప్రమేయం ఉందని ఆధారాలు దొరికితే, అరెస్టుల పర్వం మళ్లీ మొదలయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## భవిష్యత్ ఎలక్ట్రిక్ వాహనాలదే

**గచ్చిబౌలి, ముద్ర:**

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించాలంటే ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక శక్తి వాడకం తప్పనిసరి అని వక్తలు స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియాలో ప్రారంభమైన ఎలక్ట్రిక్ వెహి కల్ బ్యాటరీ సస్టెనబిలిటీ ఇంజనీర్ కోర్సు ప్రారంభోత్సవంలో పలువురు ప్రముఖులు ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎరైడ్ ఈ–మొబిలిటీ ఫౌండర్ & సీఈఓ, హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్వాల దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. 2015లో పారిస్‌లో జరిగిన కాప్–21 సమ్మిట్‌లో 195 దేశాలు తీసుకున్న నిర్ణయాల మేరకు భూమి సగటు ఉష్ణోగ్రత పెరుగుదలను 2 డిగ్రీల సెల్సియస్‌లోపే నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు ప్రతి దేశం నెట్ జీరో కాలుష్యం లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తోందని తెలిపారు. 2047 నాటికి ఈ లక్ష్యాన్ని సాధించాలంటే ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక శక్తి వినియోగానికి అలవాటు పడాల్సిన అవసరం ఉందన్నారు.





భూమిపై మనుషులే కాకుండా వేలాది జీవరాశులు నివసిస్తున్నాయని, వాతావరణ కాలుష్యాన్ని సృష్టిస్తున్న మనిషికి ప్రకృతిని నాశనం చేసే హక్కు లేదన్నారు. పెట్రోలియం ఆధారిత వాహనాల వినియోగాన్ని తగ్గించి విద్యుత్ వాహనాల వైపు అడుగులు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మరో ముఖ్య అతిథి అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా సెంటర్ ఫర్ ఎనర్జీ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజ్ కిరణ్ మాట్లాడుతూ.. వాయు కాలుష్యం కారణంగా ఐదేళ్లలోపు చిన్నారుల్లో రోజుకు సుమారు 2,000 మంది మృతి చెందుతున్నారని, 15 ఏళ్లలోపు పిల్లల్లో 93 శాతం మంది హానికరమైన గాలిని శ్వాసిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరోగ్యకరమైన భవిష్యత్ కోసం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం తప్పనిసరి అన్నారు. బ్యాటరీ ఇంజనీరింగ్ కోర్సుకు భవిష్యత్‌లో ఎన్నటికీ డిమాండ్ తగ్గదని, యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని పేర్కొన్నారు.

ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వర్ రావు మాట్లాడుతూ.. 18 నుంచి 45 ఏళ్లలోపు బీటెక్ (మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కెమికల్, ఎన్విరాన్‌మెంటల్) పూర్తి చేసిన లేదా ఫైనల్ ఇయర్‌లో ఉన్నవారు ఈ కోర్సులో చేరవచ్చన్నారు. మొత్తం 600 గంటల వ్యవధితో ప్రతి బ్యాచ్‌కు 40 మంది విద్యార్థులను మాత్రమే తీసుకుంటామని తెలిపారు. బ్యాటరీ రకాలు, సాంకేతికత, రీసైక్లింగ్, సేఫ్టీ, పర్యావరణ పరిరక్షణ అంశాలపై శిక్షణ అందిస్తామని, కేవలం రూ.20,000 ఫీజుతో ఈ కోర్సులో చేరవచ్చన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్కీ సీనియర్ కన్సల్టెంట్ సుదర్శన్, వాసవి మోటార్స్ సీఈఓ డాక్టర్ వెంకటేశం మాట్లాడారు. కొత్తగా చేరిన 40 మంది విద్యార్థులతో పాటు కాలేజ్ అధికారులు, విభాగాధిపతులు పాల్గొన్నారు. కార్యక్రమానికి జి. నరేష్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

## బీఫామ్‌ల పంపిణీలో వర్గపోరు

**ముద్ర, వనపర్తి:**

వనపర్తి కాంగ్రెస్ పార్టీలో బీఫామ్‌ల పంపిణీ మరోసారి వర్గ విభేదాలను బహిర్గతం చేసింది. తమ అనుచరులకే టికెట్లు దక్కాలన్న లక్ష్యంతో కీలక నేతల మధ్య ఆధిపత్య పోరు తారస్థాయికి చేరినట్లు పార్టీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఒకరి అనుచరులకు బీఫామ్ రాకుండా మరొకరు అడ్డుపడటంతో ఊహించని అభ్యర్థులకు టికెట్లు దక్కాయని కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధ్యక్షుడు గెలుపు అవకాశాలు ఉన్నవారికే బీఫామ్‌లు ఇచ్చామని ప్రకటించినప్పటికీ, పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా జరగలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో రెబల్ అభ్యర్థుల బెడద పెరిగి, అధికారిక అభ్యర్థుల విజయంపై ప్రభావం పడే పరిస్థితి ఏర్పడిందని కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. 33 వార్డులకు సుమారు 180 మంది దరఖాస్తులు చేయడం, స్పష్టమైన ప్రమాణాలు పాటించకపోవడం అసంతృప్తికి దారితీసిందని ఆరోపణలు ఉన్నాయి. నేతల మధ్య విభేదాలు ప్రత్యర్థి పార్టీలకు అనుకూలంగా మారుతున్నాయని, ఇదే పరిస్థితి కొనసాగితే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు నష్టం తప్పదని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

05.02.2026 గురువారం, హైదరాబాద్

www.mudranews.in | @mudranews




**తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ నదీ తీర ప్రాంతాలు**

విజయవాడ (కృష్ణా) కనకదుర్గ అమ్మవారి ఆలయంతో ప్రసిద్ధి. కృష్ణా తీరాన రాజకీయ–వాణిజ్య కేంద్రం.



# వేటు గండం తప్పింది?

- **సంజయ్.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే**
- **జగిత్యాల ఎమ్మెల్యేకు స్పీకర్ క్లీన్ చీట్**
- **కడియం విచారణ ఈ నెల 19కి వాయిదా**
- **తాము బీఆర్ఎస్ లోనే ఉన్నామంటూన్న మరో ఇద్దరు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసులో మరో ఎమ్మెల్యేకు వేటు గండం తప్పింది. తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం రేపిన ఈ కేసులో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లీన్ చిట్ ఇచ్చారు. సంజయ్‌పై అనర్హత వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి పిటిషన్ దాఖలు చేయగా దానిపై స్పీకర్ బుధవారం విచారణ చేపట్టారు. ఈ క్రమంలో సంజయ్ పార్టీ మారారనేందుకు సరైన ఆధారాలు లేవని స్పీకర్ స్పష్టం చేశారు. ఇలా మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై పార్టీ ఫిరాయింపుల పిటిషన్లు దాఖలు కాగా ఇప్పటి వరకు ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చారు. మరో ఇద్దరు ఎమ్మెల్యేలైన దానం నాగేందర్, కడియం శ్రీహరిలపై స్పీకర్ నిర్ణయం తెలియాల్సి ఉంది. ఇప్పటి వరకూ స్పీకర్ గడ్డం ప్రసాద్ 8 మందికి పార్టీ ఫిరాయింపుల కేసులో క్లీన్ చిట్ ఇచ్చారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీలు క్లీన్ చిట్ పొందారు.

**నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే : ఎమ్మెల్యే సంజయ్**

పార్టీ ఫిరాయింపు కేసులో తనకు క్లీన్ చిట్ రావడంపై జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ స్పందింకాంగ్రెస్ పార్టీలో చేరినట్లు నేను ఎక్కడా చెప్పలేదు రేవంత్ రెడ్డి ఎక్కడా చెప్పలేదన్నారు. అలాగే తాను బీఆర్ఎస్ పార్టీకి నెలకు రూ.5 వేలు కడుతున్నానని బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నట్లు అఫిడవిట్ ఇచ్చానని స్పష్టం చేశారు. తాను బీఆర్ఎస్ పార్టీ నుంచే ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచానని చెప్పారు. తాను ఇప్పటికీ ఆ పార్టీ ఎమ్మెల్యేగానే ఉన్నానని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ బిల్లులు ప్రవేశపెట్టి విప్ జారీ చేస్తే ఆ పార్టీ ఎమ్మెల్యేగానే మద్దతు ఇస్తానని ప్రకటించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి శాలువ కప్పుకున్నానన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు నేను ఎక్కడా చెప్పలేదు రేవంత్ రెడ్డి ఎక్కడా చెప్పలేదన్నారు.

**కడియం విచారణ వాయిదా**

పార్టీ ఫిరాయింపు కేసులో ఆరోపణలు ఎదుర్కొంటోన్నస్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విచారణ ఈ నెల 19న వాయిదా పడింది. ఇప్పటికే అసెంబ్లీ స్పీకర్ నుంచి ఫిరాయింపు నోటీసులు అందుకున్న కడియం బుధవారం విచచారణ కోసం స్పీకర్ ఎదుట హాజరయ్యారు. మరోవైపు కడియంపై పార్టీ ఫిరాయింపు పిటిషన్ దాఖలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ కూడా విచారణకు హాజరై తన వాదనలు వినిపించారు. ఆ సమయంలో వివేకానంద తన వద్ద ఉన్న సాక్ష్యాధారాలను స్పీకర్ కు అందించారు. ఈ క్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇరువురు నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. కాగా మున్సిపల్ ఎన్నికలు, ఫలితాలు అన్నీ పూర్తయ్యాక ఈనెల 19న మరోసారి విచారణకు హాజరు కావాలని స్పీకర్ ఆదేశిస్తూ.. విచారణను వాయిదా వేశారు. కాగా ఈనెల 18న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ను కూడా మరోసారి విచారణకు హాజరు కావాలని రెండ్రోజుల క్రితం ఆదేశించారు. వీరిద్దరి విచారణ పూర్తయ్యాక అనర్హత పిటిషన్ పై స్పీకర్ నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. దానం నాగేందర్ విషయంపై స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారని రాజకీయాల్లో ఉత్కంఠ నెలకొంది.



**కాంగ్రెస్ లో చేరావని ఒప్పుకో..**

కడియం శ్రీహరి విచారణ నేపథ్యంలో ఎమ్మెల్యే వివేకానంద కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ లో పనిచేస్తూ బీఆర్ఎస్ లోనే ఉన్నామని చెప్పడం హాస్యాస్పద మన్నారు. నీతులు చెప్పడం ఆపి.. కాంగ్రెస్ లో చేరినట్లు స్పీకర్ ఎదుట అంగీకరించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీకి వెళ్లి.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలోనే ఆ పార్టీ తీర్థం పుచ్చుకుని ఇప్పుడు ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. స్పీకర్ విచారణలో కాలయాపన చేస్తూ.. అనర్హత నుంచి ఎమ్మెల్యేలను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.

**స్పీకర్ నిర్ణయం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు : మాజీ ఎమ్మెల్సీ కవిత**

పార్టీ ఫిరాయింపుల కేసులో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ క్లీన్‌చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన జగిత్యాల ఎమ్మెల్యే గాంధీ భవన్‌కు వెళ్లి కాంగ్రెస్ పార్టీ మీటింగ్‌లో పాల్గొన్నారంటేనే పార్టీ ఫిరాయించినట్టు కదా అని ప్రశ్నించారు. ఇంతకు మించిన ఆధారాలు ఇంకేముంటాయని ఆమె ప్రశ్నించారు. ఎమ్మెల్యే సంజయ్‌పై దాఖలైన అనర్హత పిటిషన్‌ను కొట్టేసిన స్పీకర్ నిర్ణయాన్ని కవిత తప్పుబట్టారు. పార్టీ మారారనడానికి సరైన ఆధారాలు లేవని స్పీకర్ సంజయ్ కు క్లీన్ చిట్ ఇవ్వడం దారుణమన్నారు. ఆధారాలు లేవంటూ పిటిషన్ కొట్టివేసిన స్పీకర్.. రాజ్యాంగ బద్ధమైన కుర్చీలో ఉండి కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా వ్యవహరిస్తున్నారు అనుకోవాలా? అన్నారు.

## ఆధారాలున్నా క్లీన్ చీట్ ఎలా..

- **పార్టీ మారకపోతే గాంధీభవన్ లో ఎలా ఉంటారు?**
- **మున్సిపాలిటీలకు వచ్చే నిధులన్నీ కేంద్రానివే**
- **కేంద్రమంత్రి బండి సంజయ్**

**ముద్ర, సిరిసిల్ల :**

అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన ఫిరాయింపు ఎమ్మెల్యేలందరూ ప్రస్తుతం గాంధీభవన్‌లోనే ఎలా ఉంటున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఎద్దేవా చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో కాంగ్రెస్ రాజకీయం వ్యభిచారం చేస్తోందని మండిపడ్డారు. సదరు ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు అన్ని ఆధారాలున్నా స్పీకర్ ఒక్కొక్కటిగా కేసులను కొట్టివేయడం దారుణమన్నారు. ఇలాంటి తీర్పులతో ప్రజాస్వామ్యం అపహాస్యమవుతోందని చెప్పారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో కొనసాగుతూ ఆ మచ్చతో చరిత్రహీనులు కావద్దని సూచించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో నిర్వహించిన పార్టీ స్ట్రీట్ కార్నర్ సమావేశంలో బండిసంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలకు కేంద్ర ప్రభుత్వం వరదల్లా నిధులిస్తే, ఆ నిధులను మాజీ మంత్రి కేటీఆర్ పక్కదారి పట్టించాడని కేంద్రమంత్రి ఆరోపించారు. ఆ నిధులతో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల పట్టణాన్ని వరదల్లో మునిగేలా చేశాడని కేటీఆర్ పై మండిపడ్డారు. పార్టీలో, గత ప్రభుత్వంలో కీలకంగా ఉన్న కేటీఆర్ సిరిసిల్లను నాశనం చేశాడని విమర్శించారు. వర్షాకాలం వరదలు వస్తే సిరిసిల్లలో పలు కాలనీలతో పాటు ఇటీవల నిర్మించిన కలెక్టరేట్ కూడా నీట మునగడం మనం కళ్లారా చూశామన్నారు. జిల్లా కలెక్టర్ ట్రాక్టర్‌లో ఆ జల దిగ్బంధం నుంచి బయటపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. పదేళ్లు అధికారంలో



ఉండి తనపై వేల కేసులు పెట్టించిన కేటీఆర్.. ఇప్పుడు నోటీసులు పంపిస్తున్నాడని మండిపడ్డారు. కేటీఆర్ నువ్వు చేసిన అరాచకాలు నీచ పనులన్నీ బయట పెడతానని హెచ్చరించారు. సిరిసిల్లలో మొత్తం వస్త్ర పరిశ్రమ ఉంటే, కేవలం కమిషన్ల కోసం నూలు డిపోను వేములవాడలో ఏర్పాటు చేశారన్నారు. రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్లకు ఏ నిధులు ఇవ్వలేదని, నేత కార్మికులకు ఉపాధి కల్పించడంలో రెండు ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. కేంద్రం నుంచి కోట్ల రూపాయల నిధులు తీసుకువస్తే వాటిని వృథా చేస్తున్నారని చెప్పారు. లోక్ సభ ఎన్నికల్లో సిరిసిల్ల ప్రజలు కేటీఆర్ కంటే తనకే మెజారిటీ ఓట్లు వేశారని చెప్పారు. ఇప్పుడూ తనకు భయపడ్డ కేసీఆర్ కొడుకు సిరిసిల్లలోనే అడ్డా వేసి, ఓటుకు రూ.5 నుండి 10 వేలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాడని ఆరోపించారు. సిరిసిల్ల మున్సిపాలిటీలో బలవంతంగా ఏడు గ్రామాలను కలిపి అక్కడి ప్రజలకు ఉపాధి హామీ పని లేకుండా చేశారని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు విలువైన గ్రామాలను గ్రామ పంచాయతీలుగా చేస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని, ఓట్లు వేస్తే సిరిసిల్లను తాను అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డిబోయిన గోపి, రాష్ట్ర అధికార ప్రతినిధి జేసంఘప్పతోపాటు, 39 వార్డుల అభ్యర్థులు, పార్టీ జిల్లా నేతలు, నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## ఆపరేషన్ 'స్మైల్'లో 674మంది బాల కార్మికుల రక్షణ

**ముద్ర, మల్కాజిగిరి :**

మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో జనవరి 1 నుంచి 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ 'స్మైల్' కార్యక్రమంలో మొత్తం 674మంది బాల కార్మికులను రక్షించినట్లు డీసీపీ ఉమెన్ సేఫ్టీ టి.ఉషారాణి తెలిపారు. ఈ సందర్భంగా బాల కార్మికులను నియమించిన యాజమాన్యాలపై 186 కేసులు నమోదు చేయగా, 443 జనరల్ డైరీ (జీడీ) ఎంట్రీలు చేశారు. మొత్తం 189 మంది యాజమాన్య ప్రతినిధులను పోలీసులు అరెస్టు చేశారు. డివిజన్ వారీగా ఏర్పాటు చేసిన ఏడు 'స్మైల్' టీంలు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ బృందం, ఇతర లైన్ డిపార్ట్మెంట్ల సహకారంతో హానికర పరిశ్రమలు, వ్యాపార సంస్థల్లో విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. రక్షించిన పిల్లలను సంబంధిత బాలల సంక్షేమ కమిటీల ముందు హాజరు పరచినట్లు వెల్లడించారు. బాల కార్మికుల్లో తెలంగాణకు చెందిన వారు 376మంది, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు 102మంది, ఇతర రాష్ట్రాలకు చెందిన వారు 189 మంది, నేపాల్‌కు చెందిన వారు 7 మంది ఉన్నట్లు తెలిపారు. బెగంపేట డివిజన్ 'స్మైల్' టీమ్ ముగ్గురు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం డీసీపీ ఉమెన్ సేఫ్టీ టి.ఉషారాణి పర్యవేక్షణలో, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ దేవేందర్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. బాల కార్మికత్వం నేరమని, ఇలాంటి సమాచారం తెలిసిన వెంటనే 100, 112 లేదా 1098 నంబర్లకు ఫోన్ చేయాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

## బినామీ భాగోతం బయటపెడతా..

- **రేవంత్ ను వెనకుండి నడిపిస్తున్నారు**
- **దివాళా తీసిన కేఎల్ఎస్ఆర్ కు రూ.6 వేల కోట్లా?**
- **దొడ్డిదారిన ఆ కంపెనీకి నిధులు**
- **కేంద్రం స్పందించి చర్యలు తీసుకోవాలి**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

సీఎం రేవంత్ రెడ్డి బినామీ భాగోతం ఆధారాలతో సహా త్వరలోనే బయటపెడతానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ఒక బినామీ ముఖ్యమంత్రి అన్నారు. ఆయన వేరే వాళ్ల కోసం ఇక్కడ పని చేస్తున్నారనీ ఆయన్ను వెనక ఉండి నడిపించేవాళ్లు వేరే ఉన్నారని చెప్పారు. బుధవారం తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన నోటీసులతో కేఎల్ఎస్ఆర్ బాగోతం వెలుగులోకి వచ్చిందన్నారు. దివాళా తీసిన కంపెనీకి రూ.6 వేల కోట్ల ప్రాజెక్టులు కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. 2018లోనే ఆ కంపెనీపై ఐటీ దాడులు జరిగాయని, 2023లో ఆ కంపెనీ దివాళా తీసిందన్నారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి వాడుతున్న కారు కూడా కేఎల్ఎస్ఆర్ ఇన్ఫ్రా టెక్ కంపెనీ పేరుమీదే ఉందని కేటీఆర్ తెలిపారు. కంపెనీలో ఉద్యోగులకు జీతాలిచ్చే పరిస్థితి కూడా లేని సంస్థకు రేవంత్ టెండర్లు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. అది సాక్షాత్తూ రేవంత్ బినామీ కంపెనీ అని అన్నారు. రెండేళ్లుగా దొడ్డిదారిన ఆ కంపెనీకి తన అక్రమ సంపాదనను మళ్లిస్తున్నారని అన్నారు. సీఎం సీట్లో కూర్చొని కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్, ఇంకా అనేక ప్రాజెక్టుల కాంట్రాక్ట్ లను ఆ కంపెనీకి ఇచ్చారని కేటీఆర్ ఆరోపించారు. దివాళా తీసిన కంపెనీకి కాంట్రాక్టులు ఎలా ఇచ్చారని సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు ఇచ్చిందన్నారు. ఈ కంపెనీ అవకతవకలపై సీబీఐ/ఎస్ఎఫ్ఐఓ/ఈడీ ఏదైనా ఒక దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని జనవరి 23న సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిందని కేటీఆర్ తెలిపారు.

**డైవర్షన్ కోసమే సిట్ విచారణ**

ఫోన్ ట్యాపింగ్ కేసులో వరుసగా సిట్ విచారణ చేస్తుంటే తమకు అనుమానం వచ్చిందని కేటీఆర్ చెప్పారు. ఈ విషయంలో ఆరా తీస్తే.. ఈ విషయాలన్నీ తెలిశాయని కేటీఆర్ తెలిపారు. అమృత్ స్కీమ్, జల్ జీవన్ మిషన్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్.. ఇలా మొత్తం రూ.6వేల కోట్ల కాంట్రాక్టులు వచ్చినట్లు కేఎల్ఎస్ఆర్ అధికారిక వెబ్ సైట్లో పేర్కొందన్నారు. మెదక్ ఆర్ అండ్ బీలో సుమారు రూ.116 కోట్లు, షాద్ నగర్ పరిగి రోడ్డు రూ.130 కోట్లు, మోతే సూర్యాపేట కన్‌స్ట్రక్షనల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ రూ.1910 కోట్లు, గణపవరం కోదాడ రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ రూ.320 కోట్లు, కొడంగల్ వెటర్నరీ సైన్స్ న్యూ కాలేజ్ రూ.145 కోట్లు, హెచ్ఎండబ్ల్యూఎస్ మిషన్ భగీరథలో రూ.168 కోట్లు కాంట్రాక్టులు ఇచ్చారన్నారు. ఇలా రకరకాల దివాళా తీసిన కేఎల్ఎస్ఆర్ కంపెనీకి రూ.6 వేల కోట్ల ప్రాజెక్టులు ఇవ్వడం వెనుక కారణమేంటని ప్రశ్నించారు.



**కేంద్రం వెంటనే చర్యలు తీసుకోవాలి**

సుప్రీంకోర్టు ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులిచ్చి పదిరోజులైందని, ఇప్పటికైనా కేంద్రం వేగంగా స్పందించి చర్యలు చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆధారాలతో సహా పూర్తిస్థాయి బాధ్యత గల ప్రతిపక్షంగా మాట్లాడుతున్నామని పేర్కొన్నారు. ఈ కుంభకోణం మీద, కె.ఎల్.ఎస్.ఆర్ కుంభకోణం మీద వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించాలని, సిబిఐ, ఈడీ, ఎస్.ఎఫ్.ఐ.ఓ మూడింటినీ రంగంలోకి దింపి దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు.

## పాముకు పాలు పోశాం.. అది విషం కక్కింది!

- **బీఆర్ఎస్ మోసాలపై పొంగులేటి నిప్పులు**
- **ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారు?**
- **కల్లూరు గడ్డపై గూండాయిజం సాగనివ్వం!**

**ముద్ర, కల్లూరు :**

"అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయలేని అసమర్థులు.. ఇప్పుడు రంగురంగుల కండువాలు వేసుకుని మాయ మాటలతో వస్తున్నారు. గతంలో మనం ఒక వ్యక్తిని నమ్మి గెలిపించుకుంటే.. పాముకు పాలు పోసినట్లు అయ్యింది. ఆ పాము ఇప్పుడు విషం కక్కుతోంది!" అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బీఆర్ఎస్ పార్టీపై ధ్వజమెత్తారు. బుధవారం కల్లూరు మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన రోడ్ షోలో ఆయన ప్రసంగం విపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది.

**సొల్లు పురాణాలు చెప్తే సరిపోతుందా?**

వార్డుల్లోకి వస్తున్న బీఆర్ఎస్ నాయకులను నిలదీయాలని ప్రజలకు మంత్రి పిలుపునిచ్చారు. "మీ దగ్గర ఎమ్మెల్యే లేడు, మంత్రి లేడు, పోనీ నిధులు తెచ్చేందుకు ముఖ్యమంత్రి లేడు. మరి ఏముందని ప్రగల్భాలు పలుకుతున్నారు? ఎలా అభివృద్ధి చేస్తారో ప్రజలకు స్పష్టంగా చెప్పండి" అని సవాల్ విసిరారు. మభ్యపెట్టే మాటలు, సొల్లు పురాణాలు చెప్పి ఓట్లు కొల్లగొట్టాలని చూస్తే కల్లూరు ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు.

**చందాలకి.. దందాలకి ఇక సెలవు!**

గత ప్రభుత్వంలో సాగిన చందాల, దందాల రాజకీయాలకు ఈ గడ్డపై ఇక స్థానం లేదని మంత్రి స్పష్టం చేశారు. విపక్ష నాయకులు, వారి తొత్తులు అహంకారంతో మాట్లాడుతున్నారని, వారి అహంకారాన్ని అణిచివేయాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. "ఇది నా గడ్డ.. నా ఊరు. ఇక్కడ పుట్టి పెరిగిన వాడిగా చెప్తున్నా.. అభివృద్ధి చేసే సత్తా నాకుంది. చేతకాని వారు పగటి కలలు కంటున్నారు" అని ఎద్దేవా చేశారు.



**అసమర్థులకు బుద్ధి చెప్పే విప్లవం..**

20 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడం ద్వారా బీఆర్ఎస్ అసమర్థతకు చరమగీతం పాడాలని మంత్రి పిలుపునిచ్చారు. నాయకులు రానక్కర్లేదని, ప్రజలే ఒక విప్లవంలా కదిలి హస్తం గుర్తుకు ఓటు వేసి విపక్షాల అడ్రస్ గల్లంతు చేస్తారని ధీమా వ్యక్తం చేశారు.

## బీజేపీకి వచ్చేది గుండు సున్నే

- **మతం పేరుతో రాజకీయం చేసే వారితో జాగ్రత్త**
- **పవన్ కల్యాణ్ కు ఇక్కడేం పని?**
- **టీ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**
- **ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి వచ్చేది గుండు సున్నా రాబోతోందని టీ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ జోస్యం చెప్పారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో మతం పేరుతో రెచ్చగొట్టిన ఆ పార్టీకి డిపాజిట్ కూడా దక్కలేదన్న ఆయన ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లోనూ మరోసారి మతం పేరుతో బీజేపీ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. బుధవారం గాంధీభవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడి రాక అందులో భాగమే అన్నారు. తెలంగాణ ప్రజలందరూ జాగ్రత్త ఉండాలని హెచ్చరించారు. మత వైషమ్యాలకు అతీతంగా సోదరభావంతో మెలిగే తెలంగాణ ప్రజలు బీజేపీకి బుద్ధి చెప్పాలని కోరారు. భైంసా అల్లర్లతోనే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ లబ్ధి పొందిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి సంక్షేమం పేరుతో ఓట్లు అడుగుతుందని ఈ విషయాన్ని గమనించి మున్సిపల్ ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో తమను గెలిపించాలని ప్రచారం చేస్తోన్న బీజేపీ నాయకులు తెలంగాణ అభివృద్ధికి ఏం చేశారో ముందు సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది ఎంపీలు కేంద్రంలో ఆ పార్టీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారని చెప్పారు. వీరిలో ఇద్దరు కేంద్రమంత్రులు కూడా ఉన్నారన్నారు. ఇంత మంది కలిసి ఇటీవల కేంద్రం విడుదల చేసిన బడ్జెట్ లో తెలంగాణకు ఏ మేరకు నిధులు, అభివృద్ధి పనులు తీసుకు వచ్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఓట్ చోరీ తోనే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీలుగా గెలిచారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీ చట్టం ప్రకారం తెలంగాణకు న్యాయంగా రావాల్సిన పథకాలు, నిధులు, ప్రాజెక్టులు



మంజూరు చేయడం లేదన్నారు. బయ్యారం స్టీల్ ప్లాంట్, నీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా, నవోదయ పాఠశాలలు, ఐఐఎమ్ ఏర్పాటుతో పాటు పలు అంశాల్లో కేంద్రం తెలంగాణకు అన్యాయం చేసిందన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యంగా రాష్ట్రం ప్రణాళికలు రూపొందిస్తూ దేశ, అంతర్జాతీయ సంస్థల నుండి పెట్టుబడులను ఆకర్షిస్తుంటే కేంద్రం మాత్రం రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు సహకరించడం లేదని విమర్శించారు. ఆర్ఆర్ఆర్ రోడ్డు, మెట్రో రైలు, మూసీ ప్రాజెక్టు వంటి కీలకాంశాలను విస్మరిస్తోందని మండిపడ్డారు. బయో, ఫార్మా, సెమి కండక్టర్ పరిశ్రమల్లో, టూరిజంలో రాష్ట్రాన్ని విస్మరించారని దుయ్యబట్టారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5.01 శాతం అనీ ఈ లెక్కన కేంద్రం నుండి రూ.3.76 లక్షల కోట్లు దక్కాల్సి ఉందని మహేశ్ కుమార్ చెప్పారు. అయినా గత ఐదేళ్లలో రూ.1.84 లక్షల కోట్లు మాత్రమే వచ్చాయన్నారు. జీఎస్టీ వసూళ్లలో తెలంగాణ ఐదేండ్లలో రూ.4.32 లక్షల కోట్లు కేంద్రానికి ఇస్తే రాష్ట్రానికి తిరిగి రూ.3.76 లక్షల కోట్లే ఇచ్చిందన్నారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ఉత్తరాది రాష్ట్రాలకు పెద్ద పీట వేస్తూ దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు కడుతున్న పన్నులు గుజరాత్ కు తరలిస్తున్నారని విమర్శించారు. మహిళలకు బడ్జెట్‌లో రూ.90 వేల కోట్ల నిధులు కోత పెట్టారన్న ఆయన బీసీలకు ఇచ్చింది రూ.13,600కోట్లు మాత్రమేనన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలంగాణలో ప్రచారంపై టీపీసీసీ స్పందించారు. పవన్ కల్యాణ్ రాజకీయాలు ఏపీలో చేసుకోవాలని సూచించారు. ఆయన తెలంగాణ వ్యతిరేకి అని, గతంలో తెలంగాణ గురించి నీచంగా మాట్లాడారని విమర్శించారు.

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## న_కలం

### పవన్ కళ్యాణ్ ను
# మొహమాట పెడుతున్న బీజేపీ



ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో పవన్ కల్యాణ్ అటు మిత్రధర్మానికి, ఇటు సొంత పార్టీ మనుగడకు మధ్య నలిగిపోతున్నట్లు కనిపిస్తోంది. ఒక పార్టీ అధినేతగా పవన్ ప్రాధాన్యత ఎప్పుడూ తన అభ్యర్థులకే ఉండాలి. కానీ, పొత్తు అధికారికంగా లేని సమయంలో బీజేపీ కోసం ప్రచారం చేస్తే, క్షేత్రస్థాయిలో జనసేన అభ్యర్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుంది. ఇది కార్యకర్తల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసే అవకాశం ఉంది.

బీజేపీ నేతలు పవన్ కల్యాణ్‌తో భేటీ అయిన వెంటనే ఆయన మద్దతు తమకే ఉన్నట్లు ప్రకటనలు చేయడం జనసేనను ఇరకాటంలో పడేసింది. మద్దతుపై పవన్ నోరు విప్పకముందే బీజేపీ నేతలు ప్రకటించడం 'రాజకీయ ఒత్తిడి' పెంచే వ్యూహంగా కనిపిస్తోంది. జనసేన బలంగా ఉన్న చోట ఆ ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకోవడానికి బీజేపీ పవన్ ఇమేజ్‌ను వాడుకుంటోందనే వాదన బలంగా వినిపిస్తోంది.

నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత ఇలాంటి చర్చలు రావడం జనసేన అభ్యర్థులకు శాపంగా మారింది. తమ అధినేతే వేరే పార్టీకి మద్దతు ఇస్తే, ఓటర్లకు తాము ఏమని సమాధానం చెప్పాలనేది అభ్యర్థుల ప్రశ్న. ఇది పార్టీ అంతర్గత క్రమశిక్షణను, నాయకత్వంపై నమ్మకాన్ని పరీక్షించే సమయం.

ప్రస్తుతానికి బంతి పవన్ కల్యాణ్ కోర్టులోనే ఉంది. బీజేపీ మైండ్ గేమ్‌కు చిక్కుతారా లేక తన అభ్యర్థుల ప్రయోజనాలే పరమావధిగా నిర్ణయం తీసుకుంటారా అనేది చూడాలి. ముఖ్యంగా తెలంగాణ ఇన్‌ఛార్జ్ రామ్ తాళ్లూరి నుంచి వచ్చే స్పష్టత ఈ వివాదానికి తెరదించవచ్చు.

### గ్రామాలలో విచ్చలవిడిగా
# మద్యం విక్రయాలు



## మామూళ్ల మత్తులో అధికారులు

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో, పట్టణాలలో పుట్టగొడుగుల్లా బెల్టు దుకాణాలు మద్యం ను విక్రయిస్తున్నాయి . మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతూ వున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగు తున్నాయు పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా ఏరులై పారుతున్న అన్నీ తెలిసినా అటువైపు కన్నెత్తిచూడ కుండా ఎక్సైజ్ అధికారులు వ్యవహరించడం జరుగుతుందని ఆరోపణలు వినవస్తోంది. అన్ని జిల్లాలలో బెల్టు షాపుల దందా జోరుగా సాగుతోంది. పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా కిరాణాదుకాణం నుంచి మొదలుకొని నివాసగృహాలు, పాన్ షాపులు, కల్లు కాంపౌండ్‌ల సమీ పంలో మద్యం ఏరులై పారు తోంది. భవననిర్మా ణ కార్మికులు, కూలీలు, హోటల్‌లు, ఇసుక రవాణా కార్మికుల కు తెల్లవారు జామునే మద్యం అందిస్తూ బెల్టు దందాను మూడు క్వార్టర్లు, ఆరు ఆఫ్‌లుగా సాగిస్తున్నారు.మొన్ననే సర్పంచు ఎన్నికలు అయిపోయాయి గ్రామాల్లో మద్యం ఎర్లై పారింది ప్రస్తుతం రాష్ట్రం లో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్నాయి ప్రచార పర్వం ఊపు అందుకుంది ప్రచారము లో పాల్గొన్న కార్యకర్తలు మందు కొట్టే ప్రచారం చేస్తున్నారు

గతంలో వైన్ షాపుల పరిసరాలలో కొనసాగిన ఈ దందా ప్రస్తుతం గల్లీకొకటి ఏర్పాటు కావడంతో మ ద్యం ప్రియులు ఉదయం టీ, కాఫీల కు బదులుగా మద్యంను తాగుతూ ఎక్కడ పడితే అక్కడ పడిపోతూ గాయాలపాలవుతున్నారు. కొన్ని ప్రాంతాలలో ప్రత్యేకంగా ఉదయం పూట వా హనాలలో తీసుకువచ్చి, ఆ ప్రాంతంలోనే ఓ కల్లు కాంపౌండ్ పరిసరాలలో పలువురు పాన్‌షాపులు ఏర్పాటుచేసి అందులో బెల్టుదుకాణం నడిపిస్తున్నారు. ఈ విషయం ఎక్సైజ్ అధికారులకు తెలిసినా అటు వైపు కన్నెతి చూడడం లేదనే విమర్శలు ఉన్నాయి.గుడుంబా విక్రయాలు మానేసిన వారికి ప్రభుత్వం ఓవై పు స్వయం ఉపాధి మార్గాలతో జీవనోపాధి కల్పిస్తుంటే, మ రో వైపు బెల్టు దుకాణాలు పల్లెలు, పట్టణ ప్రజలను మత్తులో ముంచుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో బెల్టు దుకాణాలు కొనసాగుతున్నా.. చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోందన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.లిక్కర్ డాన్లు వివిద జిల్లాల్లో కమీషన్లకు బెల్టు షాపుల వారికి మద్యం సరఫరా చేస్తున్నారు. రోజుకు ఎంత అమ్మితే అంత కమీషన్లు అందిస్తుండడంతో బెల్టుషాపుల నిర్వాహకులు ఒకరిని చూసి మరొకరు ఈ దందాను జీవనోపాధిగా చేసుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ దందాను బహిరంగంగా కొనసాగిస్తూ ప్రజలను మత్తులో ముంచుతున్నారు. ఆ మద్యం తాగిన వ్యక్తులు వాటికి బానిసలై తమ ఆరోగ్యాలను పాడుచేసుకుంటున్నారు.ఒకప్పుడు నగరాలు ,పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ఈ దందా ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోనూ విచ్చలవిడిగా కొనసాగు తోంది. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో బెల్టు దుకాణాలపై ఉక్కుపాదం మోపుతున్నామని అధికారులు ప్రకటిస్తుంటే.. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో యథేచ్ఛగా బెల్టుదుకాణాలు కొనసాగుతున్నాయి. కొత్త మద్యం విధానం అమల్లోకి వచ్చిన ఈ కొద్ది రోజుల్లోనే గ్రామాల్లో బెల్టుదుకాణాలు జోరందు కున్నాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో ఇట్టే అర్థమవుతుం ది. ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలోనే మద్యం షాపులు కొనసాగుతున్నాయి.వివిధ మండలంలలోని కొన్ని గ్రామంలలో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామని గ్రామస్థులు ఏకగ్రీవ తీర్మానం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రెండు లక్షల బెల్టు షాపు లు నిర్వహిస్తున్నారని తెలుస్తుంది.అందులో బాటిళ్లను ఎంఆర్‌పీ కంటే రూ.50 నుంచి రూ.100 వరకు ఎక్కువకు విక్రయిస్తున్నారు.. కొందరైతే వాహనాల ను ఉదయం సమయంలో తీసుకువచ్చి అడ్డకూలీలకు, ఇసు క ట్రాక్టర్ల మీద వెళ్లే కూలీలకు అమ్మకాలు జరుపుతున్నారు.వివిధ ప్రాంతాల్లోని కల్లు కాంపౌండ్ల వద్ద గల కిరాణా దుకాణాల లో కల్తీమద్యం అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆ డుతున్నారని తెలుస్తోంది.అన్నిజిల్లాలలో ఈ దందా సంగతి తెలిసిన సంబంధిత శాఖ అధికారులు నిమ్మకు నిరేత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. కొందరు సిబ్బందికి ప్రత్యేకంగా వారం, నెలకు చొప్పున ముడుపులు అందుతుండడంతో ఏదైనా ఫిర్యాదురాగానే బెల్టు షాపుల నిర్వాహకులకు సమాచారం అందించి తనిఖీల విషయాలను చేరవేస్తున్నారు. దీంతో అప్రమత్తం అవుతున్న బెల్టు షాపుల వారు తనిఖీలలో ఏమీ దొరకకుండా జాగ్రత్త పడుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉ న్నతాధికారులు దృష్టిసారిస్తేనే ఈ బెల్టుదందాకు అడ్డుకట్టప డడమే కాకుండా ప్రజల ఆరోగ్యాలకు రక్షణ కల్పించిన వార వుతారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.యువత మాత్రం నిత్యం వీనికి బానిస ఆయి ఒళ్లు గుల్ల చేసుకుని భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారు.ప్రజల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటూంది.ఇకనయినా ప్రభుత్వం ,సంబంధిత అధికారులు దృష్టి సారించాలి.బెల్ట్ షాప్ నిర్వాహకుల మీద ఉక్కు పాదం మోపాలి.

- కామిడి సతీష్ రెడ్డి
జడలపేట,జయశంకర్ భూపాలపల్లి జిల్లా.
9848445134.
తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు.



# బాబును టార్గెట్ చేయడం వైసీపీకి లాభమా.. నష్టమా.?

ఒక ఎదురు దెబ్బ మనిషిని మారుస్తుంది. ఒక ఓటమి పార్టీలకు గుణపాఠం నేర్పుతుంది. దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీల్లోనూ ఈ తరహా మార్పు కనిపిస్తోంది. చేసిన తప్పులు చేయరాదన్న గుణపాఠాన్ని పార్టీలు నాయకులు నేర్చుకుంటున్నారు. కానీ, చిత్రంగా ఏపీలో ప్రతిపక్షంగా ఉన్న వైసీపీ మాత్రం ఈ మార్పు దిశగా అడుగులు వేయలేక పోతోందన్న చర్చ జోరుగా సాగుతోంది. ఒకసారి జరిగిన ఘోర పరాభవం నుంచి ఆ పార్టీ గుణపాఠాలు నేర్చుకోలేక పోతోంది.

2019లో 151 స్థానాలు దక్కించుకుని దేశంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న వైసీపీ. ఐదేళ్ల పాలనా కాలంలో మంచి చేసినా నిండు పాలకుండలో చిన్న ఉప్పుగల్లు మాదిరిగా వైసీపీ నాయకులు ఆ నాడు చంద్రబాబు కుటుంబంపై చేసిన వ్యాఖ్యలు ముఖ్యంగా నారా భువనేశ్వరని లక్ష్యంగా చేసుకుని చేసిన దారుణమైన వ్యాఖ్యలు ఆ పార్టీకి శాపంగా మారాయి. అదేసమయంలో చంద్రబాబు కన్నీరు పెట్టుకుంటే దానిని కూడా గేలి చేశారు. ఫలితంగా కమ్మ సామాజిక వర్గంలో ఐక్యత పెంచారు. ఇది వైసీపీ పతనానికి నాంది పలికింది.

అనంతరం గత ఎన్నికల్లో 151 నుంచి 11 స్థానాలకు వైసీపీ పడి పోయింది. దీంతో ఆ పార్టీలో భారీ మార్పు వస్తుందని అందరూ ఆశించారు. కానీ, ఎక్కడా ఆ తరహా మార్పు రావడం లేదు. ఇంకా చంద్రబాబును టార్గెట్ చేసుకుని ముందుకు వెళ్లే ప్రయత్నంలోనే ఉన్నారు. రాజకీయంగా ఆయనను టార్గెట్ చేయొచ్చు. దీనిని ఎవరూ కాదనరు. ఇరు పార్టీలు ప్రత్యర్థి పార్టీలు కావడంతో వ్యక్తిగత విమర్శలకు చోటు పెట్టుకుండా రాజకీయంగా విధాన పరమైన అంశాలను టార్గెట్ చేసుకోవచ్చు. కానీ, తాజా



పరిణామంలో మరోసారి చంద్రబాబు కుటుంబాన్ని ఆయన మాతృమూర్తిని నోరు చేసుకోవడం వంటివి ప్రజలలో మరోసారి వైసీపీని చులకన చేస్తున్నాయి. చంద్రబాబుతో పెట్టుకుని ఆనాడు అధికారం పోగొట్టుకున్నా పార్టీ నాయకులకు ఇంకా చలనం రాలేదా? అనే చర్చ జోరుగా సాగుతోంది. అంతేకాదు ఇప్పుడు అంతో ఇంతో తమ గ్రాఫ్ పెరిగిందని భావిస్తున్న సమయంలోనూ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే అనేక అంశాలు ఉన్నా వాటిని వదిలేసి బాబును టార్గెట్ చేయడం ద్వారా వైసీపీ మరింతగా ప్రజల్లో మైనస్ అయింది అనే మాట జోరుగా వినిపిస్తోంది.

- కనపర్తి రవి

# అక్షరవాన కురుస్తుంటే...

వానచినుకులు చిటపటా పడుతుంటే,
భూమి లయపట్టి సుశబ్దాలు
వినిపిస్తుంది,
కాలం క్షణాల్లో కరిగిపోతూ,
నిశ్శబ్దం శ్వాస తీసుకుంటుంది.

అక్షరజల్లులు టపటపా రాలుతుంటే,
మౌనపు గర్భంలో అర్థాలు మొలకెత్తి,
ఆలోచనలకు రూపం ఇచ్చి,
మనసుకు దారులు చూపిస్తుంది.

నల్లని మబ్బులు గర్జిస్తుంటే,
అంతరంగ మౌనం గొంతు విప్పి,
అనుభవాల భారం దించుకుని,
కాలంతో మాట కలుపుతుంది.

మిన్నున మెరుపులు మిళమిళా
మెరుస్తుంటే,
చీకటి నుదుట సత్యం మెరుస్తుంది,
అజ్ఞానపు అంచులు చెదిరి,
అర్థజ్యోతి సర్వత్రా వ్యాపిస్తుంది.

చల్లని గాలి తాకిన వేళ,
జడమైన ఆలోచనలు కదిలి,
నిశ్చలత కరిగి ప్రవాహమై,
చైతన్యం దారి పడుతుంది.

మట్టివాసనలు వ్యాపిస్తుంటే,
వేరుల జ్ఞాపకాలు తడుముతాయి,
నేలతో ఉన్న బంధం గుర్తొచ్చి,
మనసు నేలవైపు వంగుతుంది.

వర్షపునీరు గలగలా పారుతుంటే,
పాత గాయాలు మానిపోతాయి,
వేదనల బరువు తేలిపోగా,
హృదయం తేలికపడుతుంది.

అక్షరఝరులు
టకటకా ప్రవహిస్తుంటే,
స్పర్శలుగా మనసును తాకి,
గాయాలపై సాంత్వన చల్లుతూ,
భావాలకు ఊపిరి పోస్తాయి.

సకాలవర్షం సంబరమైతే,
సమాజం సేదతీరుతుంది,
అక్షరవాన కురిస్తే,
సాహిత్యం పునర్జన్మ పొందుతుంది.

వానలు కురవాలి వానదేవుడా,
పంటలు పండాలి కర్షకులారా,
అక్షరాలు వెలగాలి సరస్వతీమాతా,
మదులు మురిసిపోవాలి పాఠకులారా!

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం



# గురువుకో నూలు పోగు

పాత్రికేయ రంగంలో నాకు గురుతుల్యులు, జర్నలిష్టు ఉద్యమ కార్యకర్తగా నాకు మార్గదర్శి, మా లీడర్ బి.నాగేశ్వర రావు (బీఎన్ఆర్ ) గారి గురించి చిరు పుస్తకం రాసే అదృష్టం నాకు లబించింది. ఈ అవకాశం ఇచ్చిన తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి గారికి ధన్యవాదాలు.

అలనాటి పాత్రికేయ ప్రముఖులలో పది మంది గురించి చిరు పుస్తకాలు (Monographs) శీర్షికతో తెలంగాణ మీడియా అకాడమి ప్రచురించిన పది పుస్తకాల ఆవిష్కరణ ఈరోజు (2026 జనవరి 4న) జరిగింది.

హైదరాబాద్ లో తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో అకాడమి చైర్మన్ శ్రీనివాస రెడ్డి అధ్యక్షత న నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి చిరు పుస్తకాలను ఆవిష్కరించారు. పాత్రికేయ రంగం నుంచి రాజకీయాల లోకి వచ్చిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవ రావు గారు ఆత్మీయ అతిథిగా హాజరయ్యారు.

వ్యవస్థాపక ఎడిటర్ గా పలు పత్రికలకు జీవం పోసిన ఏబికె ప్రసాద్ గారు 95 ఏళ్ల వయసులో ఎంతో ఓపిక చేసుకుని ఈ కార్యక్రమానికి హాజరు కావడం మా అందరి అదృష్టంగా భావిస్తున్నాం. ఏబికె గురించిన చిరు పుస్తక ఆవిష్కరణ వారి సమక్షంలో జరగడం మరో విశేషం.

1928, నవంబర్ 18న కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలో జన్మించిన బి. నాగేశ్వర రావు (బీన్ ఆర్) పాత్రికేయ జీవితం 14 ఏళ్ల వయసులోనే మొదలైంది. సాయంత్రం స్కూల్‌కి వెళ్లొచ్చాక ఆనాటి స్వాతంత్ర్య, నిజాం వ్యతిరేక ఉద్యమాల గురించి, సభల గురించి పుస్తకంలో రాసుకొని, వాటిని వార్తలుగా మలిచే వ్యాపకం ఉన్న బీ ఎన్ ఆర్ ఉర్దూ పత్రికలకు, ఇంగ్లీష్ మ్యాగజైన్‌లకు వార్తలు పంపించడం ప్రారంభించారు. అలా మహాత్మా గాంధీ ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించిన సమయంలో ఆయన ప్రసంగాన్ని స్వయంగా విని, బీఎన్ఆర్ రాసిన వార్త ఒక ప్రముఖ దిన పత్రికలో ప్రచురితమైంది. అలా మొదలైన వారు పాత్రికేయ వృత్తిలో ఎడిటర్ స్థాయికి ఎదగడమే కాకుండా, ఉస్మానియా జర్నలిజం కళాశాలలో బోధకుడిగా ఎంతో మంది యువ జర్నలిస్టులను తీర్చిదిద్దారు. పదవ తరగతి చదువుతున్న సమయంలోనే స్వాతంత్ర్య ఉద్యమంలో, నైజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నారు. అదే సమయంలో అంటే పద్నాలుగేళ్ల వయసులోనే జైలుకు వెళ్లారు. 20నెలల పాటు జైలు జీవితం గడిపారు. జైలు నుంచి తిరిగొచ్చాక తన చదువును కొనసాగించి ఎంఏ పూర్తి చేశారు.

**గోల్కొండ పత్రిక, హైదరాబాద్ బులెటిన్, ప్రగతి వార పత్రిక, ఆంధ్రపత్రిక, డెక్కన్ బులెటిన్, డెక్కన్ క్రానికల్ – చీఫ్ రిపోర్టర్, డెక్కన్ క్రానికల్ – డిప్యూటీ ఎడిటర్, ఏకకాలంలో మూడు భాషల్లో వార్తా రచన చేసిన అరుదైన పాత్రికేయులు వారు.**

**1980 వ దశకంలో హైదరాబాద్ లో చిన్న పత్రికల కలలకు పునాదిగా ఆవిర్భవించిన ఎన్.ఎస్.ఎస్. (National News and Services) ఎడిటర్ గా పలువురు యువ పాత్రికేయలకు ప్రాక్టికల్ పాఠాలు చెప్పారు.**

**డైలీ న్యూస్, నవ్యాంధ్ర, ఇండియన్ హెరాల్డ్ వంటి పత్రికలకు సంపాదకులుగా వ్యవహరించారు.**

**CALAMUS పేరిట Industrial Monitor weekly ని సొంతంగా నిర్వహించారు.**

వర్కింగ్ జర్నలిస్టుల ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన బిఎన్ ఆర్ గారు అప్పటి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ ( ఏపీయూడబ్ల్యూజే ) వ్యవస్థాపకులలో ఒకరు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ ( ఏపీయూడబ్ల్యూజే ) అధ్యక్షులుగా బీఎన్నార్ అనేక మార్లు ఎన్నికయ్యారు. జాతీయ స్థాయిలో యూనియన్ (ఫెడరేషన్) ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు.




హైదరాబాద్ ప్రెస్ క్లబ్, ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ వంటి ఏపియుడబ్ల్యూజె అనుబంధ సంస్థల ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. హైదరాబాద్‌లో రాష్ట్ర యూనియన్ కార్యాలయ భవనం 'దేశోద్ధారక భవన్' నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు.

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ లో ఆయన లెక్చర్లు విన్న విద్యార్థులు ఆయనను "Moving Encyclopedia" (నడిచే గ్రంథం) అని గర్వంగా చెప్పుకుంటారు.

1993లో ఏపీయూడబ్ల్యూజే విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం "బి.నాగేశ్వర రావు ఉత్తమ పాత్రికేయ అవార్డు"ప్రారంభించింది. 2005 సంవత్సరానికి "బి.నాగేశ్వర రావు ఉత్తమ పాత్రికేయ అవార్డు" అందుకున్న అదృష్టవంతుడిని నేను.

తెలంగాణ మీడియా అకాడమి కార్యక్రమంలో బిఎన్ ఆర్ గారిపై చిరు పుస్తక రచయితగా ముఖ్య అతిథి శాసన మండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి నుంచి నాకు గౌరవాభినందనలు లభించడం నా అదృష్టం.

- బిఎస్ రామకృష్ణ
( బీఎస్ ఆర్ )



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
05.02.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ నదీ తీర ప్రాంతాలు
రాజమహేంద్రవరం (గోదావరి) తెలుగు సాహిత్యానికి జన్మస్థానం. గోదావరి పుష్కరాలు ఘనంగా జరిగే నగరం.



# ఎన్నికల ప్రక్రియ సజావుకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- ఫిబ్రవరి 11లోగా ఏజెంట్ల వివరాలు సమర్పించాలి
- కలెక్టర్ ఆదర్శ్ సురభి

**ముద్ర, వనపర్తి :**




మున్సిపల్ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ ఏజెంట్లను నియమించి సకాలంలో వారి వివరాలను సమర్పించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో మున్సిపల్ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ సునీతా రెడ్డి, జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు లక్ష్మీ బాయి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యాదయ్య పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ఫిబ్రవరి 11వ తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు ఫిబ్రవరి 13వ తేదీన చేపట్టనున్నట్లు వివరించారు. పోలింగ్ రోజున ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ఏజెంట్‌ను అభ్యర్థులు నియమించుకోవాలని, అదే విధంగా కౌంటింగ్ ప్రక్రియ కోసం ఒక్కో వార్డుకు ఒక ఏజెంట్‌ను నియమించుకోవాలని సూచించారు. కౌంటింగ్‌కు సంబంధించి ఏజెంట్ల వివరాలను ఫిబ్రవరి 11లోపు ఎన్నికల అధికారులకు సమర్పించాలని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియను వనపర్తి మున్సిపాలిటీకి సంబంధించి నర్సింగాయపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, పెబ్బేరు మున్సిపాలిటీకి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో, కొత్తకోట మున్సిపాలిటీకి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ఆత్మకూరుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, అమరచింత మున్సిపాలిటీకి ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్పీ సునీతా రెడ్డి మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభల కోసం ముందస్తుగా పోలీసు శాఖ అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కఠినంగా అమలు చేస్తున్నామని, ఎవరైనా ఉల్లంఘనలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు లక్ష్మీ బాయి మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తిగా సహకరించాలని సూచించారు. అవసరమైన అనుమతులను సకాలంలో తీసుకొని ఎన్నికల ప్రక్రియకు తోడ్పాటు అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**పారదర్శక పోలింగ్‌లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం**

మున్సిపల్ ఎన్నికలు పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడంలో సూక్ష్మ పరిశీలకులు (మైక్రో అబ్జర్వర్లు) కీలక పాత్ర పోషిస్తారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. సూక్ష్మ పరిశీలకుల బాధ్యతలపై బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు జి.లక్ష్మీబాయితో కలిసి పర్యవేక్షించారు. మాస్టర్ ట్రైనర్ శ్రీనివాసులు, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) యాదయ్యలు మైక్రో అబ్జర్వర్లకు పోలింగ్ రోజున వారి బాధ్యతలపై అంశాల వారీగా శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకుమార్, శిక్షణ నోడల్ అధికారి రామ మహేశ్వర రావు, డిప్యూటీ ఎల్డియం సాయి, మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.

**కట్టుదిట్టమైన భద్రతలో ఈవీఎంలు..**

జిల్లా కేంద్రంలో ఈవీఎంలు భద్రపరిచిన గోదాం కట్టుదిట్టమైన భద్రత నడుమ ఉందని కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. బుధవారం వనపర్తి ఆర్డీవో కార్యాలయం వెనుక ఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదామును నెలవారీ తనిఖీల్లో భాగంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఖీమ్యా నాయక్, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా గోదాం వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల ద్వారా ఏర్పాటు చేసిన భద్రతా వ్యవస్థ పనితీరును పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీప్యాట్ గోదాములను తనిఖీ చేసి సమగ్ర నివేదికలను సమర్పిస్తున్నామని తెలిపారు. బుధవారం నెలవారీ తనిఖీలు నిర్వహించినట్లు వివరించారు. ఈ తనిఖీల్లో ఎన్నికల అధికారులు, ఇతర అధికారులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.



# 'పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం'

**ముద్ర, తాండూరు :**

సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తాండూరు నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం తాండూరు పట్టణంలోని 7, 8వ వార్డుల్లో పర్యటిస్తూ కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా రాజీవ్ గృహకల్ప ఇందిరమ్మ కాలనీ, ఎన్టీఆర్ నగర్, హరిహర టౌన్‌లలో మౌలిక వసతుల కల్పనకు చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆయా కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎన్నికల అనంతరం పరిష్కరించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. 7, 8వ వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు బాతుల నాగరాజు, తలారి సాయప్ప తరపున విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే వార్డు నంబర్ 7లోని ఎన్టీఆర్ నగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచినట్లు తెలిపారు. మిగిలిన సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని అన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి, కౌన్సిలర్ అభ్యర్థి బాతుల నాగుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపిస్తే, కాలనీల్లోని అనేక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి బాతుల నాగు, 8వ వార్డు అభ్యర్థి తలారి సాయప్ప, వార్డు ఇన్‌చార్జ్ లొంక నర్సింలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జుబేర్ లాల, బాతుల వెంకటయ్య, అబ్దుల్ రహూఫ్, శివకుమార్, వెంకన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ముద్ర, మల్కాజిగిరి :**

మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని కాలనీల అభివృద్ధికి డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని కార్పొరేటర్ శ్రవణ్ తెలిపారు. బుధవారం మల్కాజిగిరి డివిజన్‌లోని బలరాం నగర్ కాలనీలో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి స్థానికులు దాదాపు రూ.83 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బలరాం నగర్ కాలనీలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి సుమారు రూ.48 లక్షలు, డాక్టర్ రమేష్ రెడ్డి చిల్డ్రెన్స్ హాస్పిటల్ వద్ద ప్రధాన రోడ్డుకు రూ.35 లక్షలతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే బలరాం నగర్‌లో అనేక కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కాలనీలో పలు సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, నాలా సంబంధిత పనులు చేపట్టినందుకు స్థానికులు కార్పొరేటర్ శ్రవణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. త్వరలో మరిన్ని కోట్ల రూపాయలతో మురుగు నీటి సమస్య నివారణకు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ నవీన్, రమేష్, సూరజ్ సింగ్, రామ్ లకన్, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ సింగ్, కిషోర్ సింగ్, వెంకట్రావు, సతీష్ కుమార్‌తోపాటు పెద్దసంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

# 'శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరం'

**ముద్ర, కాప్రా :**

కాప్రా గాంధీనగర్ పరిసర ప్రాంతాల్లో శాంతి భద్రతలను మరింత పటిష్టం చేయడంతోపాటు వాహనదారుల భద్రతను నిర్ధారించేందుకు కుషాయిగూడ సీఐ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో వాహనాల తనిఖీలు, ఫుట్ పేట్రోలింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు వెంకన్న, శ్రీనివాస్, గోపాల్ రెడ్డి, అశోక్, గోపాల్‌తో పాటు క్రైమ్ టీం సభ్యులు, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. తనిఖీల సందర్భంగా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడంతో పాటు హెల్మెట్ ధరించడం, డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాల్సిన ప్రాముఖ్యతను వివరించారు. పోలీసుల ఈ ముందస్తు చర్యలు ప్రజల భద్రతకు మేలు చేస్తాయని, శాంతియుత వాతావరణం కొనసాగేందుకు దోహదపడతాయని అధికారులు తెలిపారు.

# సామాజిక, వివక్ష లేని సమాజ నిర్మాణానికి భాగస్వాములు కావాలి

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

సామాజిక న్యాయం, వివక్ష లేని సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేటులోని సమావేశ మందిరంలో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, జిల్లా అధికారులు, సిబ్బందితో కలిసి కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భారతదేశానికి స్వాతంత్రం వచ్చినప్పటికీ సామాజికపరంగా, వివక్షతో కూడిన సమాజంలో మార్పు రావాలన్న సదుద్దేశంతో ప్రతియేటా ఫిబ్రవరి 4న తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎన్నికల వ్యయ పరిశీలకులు రమేష్, జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి, డిఆర్ఓ మంగీలాల్, ఆర్డీఓ వాసు చంద్ర, డిబిసిడిఓ మాధవ రెడ్డిలతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

**ముద్ర, మల్కాజిగిరి :**

ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని సత్తిరెడ్డి నగర్‌లో రూ.20లక్షల వ్యయంతో చేపట్టనున్న బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్ కాలనీవాసులతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీవాసులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ఈ పనులు ఉపయోగపడతాయని తెలిపారు. కాలనీలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు శ్రీనివాస్ రెడ్డి, సాగర్ రెడ్డి, హేమా, దీపిక, సుమతి, అర్చన పాల్గొని అభివృద్ధి పనులు ప్రారంభించినందుకు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్ రావు తదితరులు పాల్గొని అభివృద్ధి కార్యక్రమాలకు తమ మద్దతు ప్రకటించారు.




# అక్రమ స్కానింగ్‌లపై కఠిన చర్యలు

- ప్రతి స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేయాలి : కలెక్టర్

**ముద్ర, నారాయణపేట :**

జిల్లాలో అర్హత లేని వైద్యులు స్కానింగ్ నిర్వహిస్తే పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సిక్తా పట్నాయక్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి బహుళ సభ్య అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ సమీక్ష సమావేశం జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి స్కానింగ్ కేంద్రాన్ని సందర్శించి అందులోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్‌కు సూచించారు. అర్హత లేని వైద్యులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్కానింగ్ చేయరాదని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే జైలు శిక్ష తప్పదని ఆమె స్పష్టం చేశారు. జిల్లాలో తక్కువగా ఉన్న లింగ నిష్పత్తి (0-6 సంవత్సరాలు)పై ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత మండలాల్లో లింగ నిష్పత్తి పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మూడేళ్ల క్రితం ఎక్కువగా ఉన్న లింగ నిష్పత్తి ఈ ఏడాది తగ్గడంపై కలెక్టర్ ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ, ఇందుకు గల కారణాలను సమగ్రంగా విశ్లేషించాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను తరచుగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలిస్తున్నట్లు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్పీ డా.వినీత్ కుమార్ మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా జిల్లాలో లింగ నిష్పత్తి పరిస్థితిపై ప్రశ్నించారు. 2024-25లో (1000కి 955)గా ఉన్న లింగ నిష్పత్తి 2025-26లో (1000కి 927)కు తగ్గిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎక్కువగా గర్భస్రావాలు జరుగుతున్న ఆసుపత్రులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠినంగా తనిఖీ చేయాలని సూచించారు. ముఖ్యంగా ఇద్దరు ఆడపిల్లలు ఉన్న గర్భిణీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**



జిల్లాలో నిర్వహించనున్న 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని బృందాలు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల నోడల్ అధికారులు, ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి, జోనల్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో ఉన్న అన్ని టీమ్‌లు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి బృందాలు తనిఖీలు మరింత సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. అకౌంటింగ్ టీమ్ సభ్యులు వివరాలను షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్లలో సక్రమంగా నమోదు చేయాలన్నారు. ర్యాలీలు, సమావేశాల సందర్భంగా రాజకీయ పార్టీల ప్రచార వ్యయాన్ని ఎన్నికల సంఘం నిర్ణయించిన రేట్ల ప్రకారం నమోదు చేయాలని సూచించారు. ఓటర్లను ప్రలోభపెట్టేలా డబ్బు, మద్యం పంపిణీ జరగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఎస్ఎస్‌టి బృందాలు కఠిన తనిఖీలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలకు పీఓలు, ఏపీఓలను నియమించామని, ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఓటరు అవగాహన కోసం స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎస్పీ స్నేహ మెహర మాట్లాడుతూ.. ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు పటిష్టమైన బందోబస్తు కల్పించామని తెలిపారు. జిల్లాలో 36 కీలక ప్రాంతాలను గుర్తించి సిబ్బందిని నియమించామని, అక్రమంగా తరలించే మద్యం, నగదుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్ఓ మంగీలాల్, ఆర్డీఓ వాసుచంద్ర, నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహణకు సహకరించాలి..**

ఎన్నికల నిబంధనల మేరకు ప్రజాస్వామ్యబద్ధంగా, సామరస్యంగా ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేలా సహకరించాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు జి.రవి అన్నారు. బుధవారం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ బరిలో పాల్గొంటున్న అభ్యర్థులకు ఎన్నికల నియమావళి, ప్రచార సరళి, వివిధ అనుమతులు, ఎన్నికల్లో అభ్యర్థులు ఖర్చు చేస్తున్న వివరాల సమర్పణ తదితర అంశాలపై చేపడుతున్న అవగాహన కార్యక్రమంలోఆయన పాల్గొని పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, ఎన్నికల వ్యయ పరిశీలకులు రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధిపై జోనల్ కమిషనర్‌తో పీఏసీ ఛైర్మన్ గాంధీ సమీక్ష

**ముద్ర, శేరిలింగంపల్లి :**



శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పీఏసీ ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడేతో సమావేశమయ్యారు. శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్‌తో కలిసి ఈ మర్యాదపూర్వక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఛైర్మన్ గాంధీ మాట్లాడుతూ. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, అసంపూర్తిగా మిగిలిన ప్రాజెక్టులపై జోనల్ కమిషనర్‌తో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. పెండింగ్ పనులు వేగంగా పూర్తి అయ్యేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు సకాలంలో మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, పనుల అమలులో వేగం పెంచాలని కోరారు. ప్రజలకు అన్ని రకాల మౌలిక వసతులు అందించే దిశగా ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ముఖ్యంగా రోడ్ల మరమ్మత్తులు త్వరితగతిన చేపట్టాలని సూచించారు. అభివృద్ధి పనుల నిర్వహణలో ఎలాంటి అడ్డంకులు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 05-02-2026
www.mudranews.in | @mudranews



తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ నదీ తీర ప్రాంతాలు

శ్రీశైలం (కృష్ణా నది)

మల్లికార్జున స్వామి ఆలయం పుణ్య క్షేత్రం. కృష్ణా నది మధ్యలో ప్రకృతి–ఆధ్యాత్మిక సమ్మేళనం.



## పెద్దపల్లి మున్సిపాలిటీ అభ్యర్థులను
# అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

- పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నూతన ఐటీ పార్కు..
- పట్టణంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం...
- మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు



**ముద్ర, పెద్దపల్లి:**
రాష్ట్రంలోనే పెద్దపల్లి మున్సిపాలిటీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని గోల్డెన్ తులిప్ బ్యాంకెట్ హాల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర గౌరవ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కలిసి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ బి.ఆర్.ఎస్ హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను విచ్చిన్నం చేసిన కూడా కాంగ్రెస్ పార్టీ దాన్ని గాడిలో పెట్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నార. బి.ఆర్.ఎస్ 10 ఏళ్ల పరిపాలనలో పట్టణాలను, పల్లెలను గాలికొదిలేసారని అన్నారు. ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉండి పెద్దపల్లి జిల్లాకు నిధులు కేటాయించలేదని, పెద్దపల్లి మున్సిపల్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నూతనంగా ఐటీ పార్కును ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. గత బి.ఆర్.ఎస్ పార్టీ డబుల్ బెడ్ రూమ్ లను అరకొరగా కట్టి లబ్ధిదారులకు అందించలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత డబుల్ బెడ్ రూంలకు మౌలిక సదుపాయాలు కల్పించి అందించిన ఘనత మీ ఎమ్మెల్యే విజయరమణ రావుదే అని అన్నారు. అలాగే ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నామని అన్నారు.

# సామాజిక సమానత్వంతోనే అభివృద్ధి

## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**ముద్ర, కరీంనగర్:**
సామాజిక సమానత్వం ద్వారానే అన్ని వర్గాలు, తద్వారా దేశం అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. భగత్ నగర్ లోని ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో బుధవారం 'తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. దివ్యాంగులు, నిరుపేదలందరికీ సమాన అవకాశాలు కల్పించాలని, వృద్ధులకు న్యాయం, సేవా అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. అందరూ ఐక్యంగా ఉంటూ ఒకరికి ఒకరు సహకరించుకుంటూ సమాజాన్ని గొప్పగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. విద్యార్థులు గొప్ప ఆశయంతో ముందుకు వెళ్లాలని, ముఖ్యంగా బాలికలు ఉన్నత విద్య అభ్యసించి ఉపాధి అవకాశాలతో ఆర్థిక సాధికారత సాధించాలని తెలిపారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్ని వర్గాలు అభివృద్ధి చెందినప్పుడే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సామాజిక న్యాయ దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు.

అనంతరం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వసతి గృహాన్ని సందర్శించారు. హాస్టల్లో విద్యార్థుల కోసం అమర్చిన గీజర్, పలు సౌకర్యాలను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, వసతి గృహ సంక్షేమ అధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

# 12న జాతీయ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

**ముద్ర, కరీంనగర్:**
ఈ నెల12న జరిగే జాతీయ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, ఉపాధ్యక్షుడు జంగం తిరుపతి యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్యలు పిలుపునిచ్చారు. బుధవారం బొమ్మకల్ లోని సిమెంట్ గోదాముల వద్ద సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్ ను ఏఐటీయూసీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు ప్రజా, వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని ఫిబ్రవరి 12న జరిగే జాతీయ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థల వాటాల అమ్మకం నిలిపివేయాలని, వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర పెంచాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అధిక నిధులు కేటాయించాలని, అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత ఇన్సూరెన్స్ సౌకర్యం, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, ముఖ్యంగా హమాలి ఇతర రంగాల కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిమెంటు గోదాం హమాలి సంఘం ఏఐటీయూసీ నాయకులు బాగోతం వీరయ్య, కొమురయ్య, శ్రీనివాస్, ఐలయ్య, రాములు గౌడ్, శ్రీనివాస్, కొమురయ్య పాల్గొన్నారు.

# మేయర్ పీఠం బీజేపీకి అప్పగిస్తే వరదల్లా నిధులు తెస్తా..

- మా వాళ్లు గుణవంతులు... వాళ్లు ధన వంతులు - మా వాళ్లు మీ కోసం కొట్లాడి జైలుకు పోతే.. వాళ్లు కబ్జాలు చేసి జైలుకు వెళ్లారు
- వాళ్లు గెలిస్తే పన్నుల మోత... మేం గెలిస్తే పన్నులు పెంచకుండా అభివృద్ధి చేస్తాం.. - ఎన్నికల ప్రచారంలో కేంద్ర మంత్రి బండి సంజయ్





**ముద్ర, కరీంనగర్:**
కరీంనగర్ లో మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే వరదల్లా నిధులు తెచ్చే బాధ్యత తీసుకుంటానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హామీ ఇచ్చారు. పొరపాటున కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను గెలిపిస్తే మీ ఇండ్లలోకి వరద నీళ్లు వస్తాయే తప్ప అభివృద్ధి జరగదని అన్నారు. "బీజేపీ పక్షాన పోటీ చేసే అభ్యర్థులు గుణవంతులైతే... కాంగ్రెస్, బీఆర్ఎస్ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు ధనవంతులు. మా వాళ్లు (బీజేపీ) మీ సమస్యలపై పోరాటం చేసి జైలుకు పోతే, ఆ పార్టీల నాయకులు కబ్జాలు, దోపిడీలు చేసి జైలు కెళ్లారు. బోత్ ఆర్ నాట్ సేమ్" అని తనదైన శైలిలో చెప్పారు.

బుధవారం సాయంత్రం కరీంనగర్ లోని రాంనగర్ సత్యనారాయణ స్వామి వద్ద తొలుత 46, 47 డివిజన్ల అభ్యర్థులు అఖిల్ గౌడ్, గాజె రమా శివరాం పక్షాన, అనంతరం కమాన్ చౌరస్తా వద్ద నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లో 38, 56, 57 డివిజన్ల అభ్యర్థులు దేవసాని సరస్వతి, తాటి ప్రభావతి, కొలిపాక రమ్య శ్రీ పక్షాన ప్రచారం నిర్వహించారు. ఆయా డివిజన్ల బీజేపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. మాజీ మేయర్ సునీల్ రావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్ప, సీనియర్ నాయకులు నల్లాల ఓదేలు, ప్రమోద్ రావు, యువ క్రాంతి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై నిప్పులు చెరిగారు. రమా సత్యనారాయణ స్వామి టెంపుల్ నుండి సంతోష్ నగర్, పారమిత స్కూల్, జ్యోతి నగర్, భాగ్యనగర్ సాయిబాబా టెంపుల్ ఏరియా రోడ్లు.... హైమాస్ట్ లైట్ మొదలు ఇక్కడ జరిగిన అభివృద్ధి పనులన్నీ స్మార్ట్ సిటీ నిధులతో నిర్మించినవేనని అన్నారు. టెలిఫోన్ క్వార్టర్స్ రోడ్డు, అవతల ఉన్న ఎల్ఎండి బైపాస్ రోడ్డును సైతం కేంద్రం ఇచ్చిన రూ.30 కోట్లతో ఆధునీకరించినట్లు తెలిపారు. ఇటు జాతీయ రహదారి కనెక్టింగ్ రోడ్డు.. అటు ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ఇటు సిరిసిల్ల బైపాస్ రోడ్డు వరకు రూ.10 కోట్ల కేంద్ర నిధులతోనే సెంట్రల్ లైటింగ్, సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటైందన్నారు. అమృత్ 1 ద్వారా కేంద్రం రూ.132 కోట్లు ఇస్తే ఆ పైసలతోనే మార్క్ ఫెడ్ దగ్గర కొత్త రిజర్వాయరును నిర్మించామని, గతంలో డైలీ ఇంటికి నీళ్లు వచ్చేవని, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల దినం తప్పించి దినం నీళ్లు వస్తున్నాయని అన్నారు. మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే... ప్రతినిత్యం తాగునీటి సరఫరా అందిస్తామని తెలిపారు.

46 డివిజన్లో అఖిల్ గౌడ్, 47వ డివిజన్ అభ్యర్థిని గాజ రమను, 38వ డివిజన్ దేవసాని సరస్వతి, 56వ డివిజన్ తాటి ప్రభావతి, 57వ డివిజన్ కొలిపాక రమ్యశ్రీలను భారీ మెజారిటీతో గెలిపిస్తే పెండింగ్ పనులన్నీ పూర్తి చేయిస్తా... ఆదర్శంగా తీర్చిదిద్దుతానని చెప్పారు.

ఇక్కడ సత్యనారాయణ ఆలయంలో అన్నీ రాజకీయాలే నడుస్తున్నయని, ఈ ఆలయానికి రావాలంటే ప్రజలు భయపడుతున్నారని అన్నారు. నేను మహాలక్ష్మీ అమ్మవారి ఆలయాన్ని నిర్మించిన, అమ్మవారే అన్నీ అని ఆ ఆలయానికి ఛైర్మన్ ఉండరు. హుండీలు ఉండవని, మేమంతా అమ్మవారి సేవకులేనని అన్నారు. బీజేపీకి మేయర్ పీఠాన్ని అప్పగిస్తే సత్యానారాయణ స్వామి ఆలయం వద్ద ధ్వజ స్తంభం కట్టిస్తా. ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కమాన్ నుంచి.. భారత్ టాకీస్ చౌరస్తా.. టవర్ సర్కిల్ రోడ్డు.. శాస్త్రి రోడ్డుకు వెళ్లే రోడ్డు.. రాజీవ్ చౌక్ రోడ్ల బాగైనంటే కేంద్ర నిధులతోనే.. గణేష్ నగర్ డ్రైనేజీని వెడల్పు చేసి పైన స్లాబ్ వేసి.. ఆధునీకరించిన పైసలన్నీ కేంద్రానివేనని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్ల నుంచి ఒక్క పైస ఇయ్యలేదు. మోదీ ప్రభుత్వం ఇచ్చిన 26 కోట్లతోనే అంబేద్కర్ స్టేడియాన్ని ఆధునీకరించామని, మోడ్రన్ షాపింగ్ కాంప్లెక్స్, పిల్లల కోసం బాస్కెట్ బాల్ కోర్టు, స్కేటింగ్ మైదానం, వాకింగ్ ట్రాక్, ఇండోర్ స్టేడియాన్ని బాగు చేసినట్లు తెలిపారు.

బీఆర్ఎస్ అంటేనే భూ రాక్షసుల సమితి. వాళ్లు అధికారంలో ఉన్నంతకాలం కబ్జాలు చేసి దోచుకున్నరని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎంత దోచుకున్నరో రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అంతకంటే ఎక్కువ దోచుకుంటున్నరని ఆరోపించారు. కరీంనగర్ కార్పొరేషన్ కు మాత్రం నయా పైసా ఇయ్యలేదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మాత్రం అమలు చేయలేదని కేంద్రమంత్రి తెలిపారు. కాంగ్రెస్ ను గెలిపిస్తే ఇంటి పన్నులు, నల్లా బిల్లులు, అన్ని రకాల పన్నులు పెంచి ఖజానా నింపుకుంటారని అన్నారు.

ఈ ఎన్నికలు ధనవంతులకు, గుణవంతులకు మధ్య జరుగుతున్న పోరాటమని, ధనవంతులను గెలిపిస్తే మీ పనుల కోసం వాళ్ల ఇండ్ల చుట్టూ తిరగాలని, గుణవంతులను గెలిపిస్తే వాళ్లు ఎప్పుడు మీ వెంట ఉంటూ సేవ చేస్తారని, గుణవంతుల వైపు ఉంటారో.. ధనవంతుల వైపు ఉంటారో.. మీరే ఆలోచించుకోండని అన్నారు. ఎవరికి ఓటేస్తారో ఆలోచించి తీర్పు ఇవ్వండని కేంద్రమంత్రి సంజయ్ కుమార్ కోరారు.



## ధర్మపురి శ్రీలక్ష్మి నర్సింహస్వామికి
# ఇచ్చిన మాట తప్పిన కేసీఆర్

- యాదాద్రిని అభివృద్ధి చేసి ధర్మపురిని పట్టించుకోని బీఆర్ఎస్..
- మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ ను గెలిపిస్తే అధిక నిధులు - రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ముద్ర, జగిత్యాల:**
ప్రముఖ పుణ్య క్షేత్రమైన ధర్మపురి శ్రీలక్ష్మి నర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి రూ. 500 కోట్లు ఇస్తానని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట తప్పారని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ధర్మపురి పట్టణంలోని 1వ వార్డు, 9వ వార్డులలో బుధవారం మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2018 ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన కేసీఆర్ ధర్మపురి ఆలయ అభివృద్ధికి రూ. 500 కోట్లు విడుదల చేస్తానని మాట తప్పారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. యాదాద్రి ఆలయాన్ని అభివృద్ధి చేసిన కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం ధర్మపురి ఆలయాన్ని మాత్రం మరిచిపోయారని మంత్రి పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతో గెలిచిన తాను గడిచిన రెండేళ్లు ప్రజా ప్రభుత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజా సంక్షేమానికి పథకాలను ఆమలు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో 15 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే గోదావరి పుష్కరాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించి ధర్మపురి పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వంలో ఇప్పటికే నాలుగు గ్యారంటీలు అమలు చేస్తున్నామని రానున్న రోజుల్లో మిగిలిన రెండు గ్యారంటీలు అమలు చేస్తామని మంత్రి అన్నారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ఖజానా ఖాళీ కావడంతో రెండు గ్యారంటీల అమలు ఆలస్యమవుతుందని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మిగిలిన రెండు గ్యారంటీలను సైతం అమలు చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని మంత్రి వివరించారు. ధర్మపురి పట్టణంలో గడిచిన రెండు ఏళ్లుగా అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. పట్టణంలో 695 మందికి కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేశామన్నారు. పట్టణంలోని 154 మంది లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇళ్లకు రూ.7 కోట్ల 70 లక్షలు చెల్లించామని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 327 మందికి రూ. 93 కోట్ల 75వేలు అందజేశామని, కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా 206 పేదలకు రూ. 2 కోట్ల 6లక్షల 23 వేలు అందజేశామని వివరించారు. గృహ జ్యోతి పథకం ద్వారా 2,783 మంది లబ్దిదారులకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామని తెలిపారు. పట్టణంలో 542 మంది రైతులకు రూ. 4 కోట్ల 2 లక్షల 58 వేల రుణ మాఫీ చేశామని అన్నారు. 15 కుల సంఘాలకు కోటి 85 లక్షలతో కమ్యూనిటి హాల్స్ నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. టీఎఫ్ఐడీసీ, రూరల్ డెవలప్ మెంట్, స్పెషల్ డెవలప్ మెంట్ ఫండ్, సీఎస్ఆర్ నిధులతో పట్టణ ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. వచ్చే మున్సిపాల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను పెద్ద మెజార్టీతో గెలిచించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు.

# స్వతంత్ర బీసీ అభ్యర్థులను గెలిపించుకోవాలి



**ముద్ర, కరీంనగర్,**
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీలకు మొండి చెయ్యి చూపించాయని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ అన్నారు. బుధవారం కరీంనగర్ భాగ్యనగర్ లోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నికార్స్ అయిన కేడర్ కు మొండి చేయి చూపించారని, అంగ బలం అర్థ బలానికే పార్టీలు రెడ్ కార్పెట్ పరిచాయని అన్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నగారా మోగంగానే గల్లీలో రాజకీయ చదరంగం మొదలైందని, సిట్టింగ్ ఉన్న కార్పోరేటర్లను మరచి నిన్న మొన్న వచ్చి పార్టీలో జాయిన్ అయిన వారికి పట్టం కట్టడం భావ్యమా అని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి పార్టీ జెండాను గుండెలకు హత్తుకొని ప్రత్యర్థుల దాడుల ఎదుర్కొని కేసుల పాలైన సామాన్య కార్యకర్తలకు ఈ ఎన్నికల్లో చుక్కెదురైందని అన్నారు. ప్రధాన పార్టీలు అన్ని సిద్ధాంతాలను అటకెక్కించాయని చెప్పారు. స్వతంత్రంగా పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థులను గెలిపించి ప్రధాన పార్టీలకు బుద్ధి చెప్పాలని, స్వతంత్ర అభ్యర్థులకు పట్టం కట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
05.02.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ నదీ తీర ప్రాంతాలు

భద్రాచలం (గోదావరి) శ్రీరామ భక్తి, సాంస్కృతిక వైభవానికి కేంద్రము. గోదావరి తీరాన కార్తీక మాసోత్సవాలు ప్రత్యేక ఆకర్షణ.





## కాంగ్రెస్ కొత్తగా చేసిందేమీ లేదు..

- **కొత్తగూడెం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఎంపీ వద్దిరాజు**

**ముద్ర, కొత్తగూడెం:**

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, జాతిపిత కల్వకుంట్ల చంద్రశేఖర రావు పాలనలో కొత్తగూడెం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని, అన్ని విధాలా గొప్పగా అభివృద్ధి చెందిందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. మునిసిపల్ ఎన్నికల సందర్భంగా ఎంపీ రవిచంద్ర బుధవారం సాయంత్రం 12వ డివిజన్ పాత కొత్తగూడెం,25వ డివిజన్ సన్యాసీ బస్తీల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర తనను కలిసిన టీవీ ఛానెల్స్ ప్రతినిధులతో మాట్లాడారు. కేసీఆర్ పాలనలో కొత్తగూడెం జిల్లా కేంద్రంతో పాటు మెడికల్, నర్సింగ్ కాలేజీల ఏర్పాటు జరిగిందన్నారు. పట్టణంలో సుమారు 500 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పన జరిగిందని, రోడ్ల విస్తరణ, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటుతో కొత్తగూడెం సుందరంగా మారిందన్నారు.

## కుల వివక్షలేని సమాజాన్ని నిర్మించాలి

- **ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం**

పిల్లలు ప్రమాణాలతో కూడిన విద్యను అందుకొని ఉన్న స్థాయికి చేరుకోవడమే వారి తల్లిదండ్రులకు ఇచ్చే అతి పెద్ద బహుమతి అని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఎర్రుపాలెం మండలం సందర్శన సందర్భంగా బుధవారం ఎర్రుపాలెం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులం బాలికల కళాశాలలో నిర్వహించిన "తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం" వేడుకకు హాజరైన కలెక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలతో నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ కుల వివక్ష లేని సమాజంగా తెలంగాణను నిర్మించే దిశగా ప్రభుత్వం సాంఘిక, ఆర్థిక సర్వేను విజయవంతంగా నిర్వహించి 4 ఫిబ్రవరి, 2025న అసెంబ్లీలో ప్రవేశపెట్టారని తెలిపారు. కుల, మత విభేదాలు లేకుండా ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమరపరుస్తుందని పేర్కొన్నారు. గురుకులాల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు డైట్ చార్జీలను 40 శాతం పెంచామని, ఈ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు సమీకృత గురుకుల విద్యాలయ నిర్మాణాలు చేపట్టిందన్నారు. సామాజిక న్యాయం ఉన్న సమాజాన్ని తయారు చేసేందుకు ప్రభుత్వం కల్పించే సదుపాయాలు వినియోగించుకుంటూ బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకుంటే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకై ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి మంచి విద్యాసంస్థల ఏర్పాటు చేయడమే కాకుండా విద్యార్థులకు అవసరమైన డైట్, కాస్మోటిక్ చార్జీలు ఇతర మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు.





## పోలింగ్ సిబ్బంది కి ర్యాండమైజేషన్ ప్రక్రియ

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

మున్సిపాలిటీ వార్డు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది కి ర్యాండమైజేషన్ ప్రక్రియను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, సాధారణ పరిశీలకులు గౌతమి, సమక్షంలో నిర్వహించారు. బుధవారం ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను అదనపు కలెక్టర్, సాధారణ పరిశీలకులు నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, పోచంపల్లి, చౌటుప్పల్, మోత్కూర్ మున్సిపాలిటీ లలో వార్డుల ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు,అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు , ఇతర పోలింగ్ అధికారులు ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. జిల్లాలోని 104 వార్డు స్థానాలకు, ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ స్టాఫ్ కలుపుకుని ప్రిసైడింగ్ అధికారులు 257, అసిస్టెంట్. పీ.ఓలు 257,ఇతర పోలింగ్ అధికారులు 514 పోలింగ్ కోసం ర్యాండమైజేషన్ జరిపారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.



## మన గ్రామ పరిశుభ్రత మన బాధ్యత

- **నడిగూడెం సర్పంచ్ దున్న శ్రీనివాస్**

**ముద్ర, నడిగూడెం:**

గ్రామంలో తాగు నీటి సమస్య రాకుండా చర్యలు చేపడతామని సర్పంచ్ దున్న శ్రీనివాస్ తెలిపారు. గ్రామంలోని చెలక బజార్ బిసి కాలనీలో తాగు నీటి సమస్య ఉందని మహిళలు తెలపడంతో వెంటనే స్పందించిన సర్పంచ్, పాలకవర్గ సభ్యులు బుధవారం పబ్లిక్ ట్యాప్ ను ఏర్పాటు చేసి అక్కడున్న ప్రజలకు తాగు నీటి సమస్య లేకుండా చేశారు. మంచి నీటిని వృధాగా పోనివ్వకుండా హౌస్ నిండిన వెంటనే మూతలు పెట్టాలని ప్రజలను కోరారు. పాలకవర్గ సభ్యులు గ్రామస్తుల సహకారంతో ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వెల్లడించారు.ఇంటి ముందు ఉన్న మురికి కాలువలోకి, బహిరంగ ప్రదేశాలలో రోడ్ల పైన చెత్తాచెదారం, ప్లాస్టిక్ సంచులు, ఇతర వ్యర్థాలు, వెయ్యరాదని కోరారు.మన గ్రామం మన పరిశుభ్రత మన అభివృద్ధి మనందరి బాధ్యత అనే నినాదంతో గ్రామంలో పారిశుధ్యం, అభివృద్ధి పనులకు గ్రామ ప్రజలు సహకరించాలని తెలిపారు. గ్రామాభివృద్ధిలో దాతల సహకారం కావాలని గ్రామాన్ని అభివృద్ధి చేసుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎలుగురి నాగరాజు వార్డ్ సభ్యులు దున్న శ్రీకాంత్ కాసాని మాధవి గోపినాధ్ గ్రామస్తులు కాసాని వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా పంపిణీలో విఫలం

- **ప్రస్తుత విధానాన్ని మార్చాలి**
- **సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో**

**చిలుకూరు, ముద్ర:**

రైతులకు యూరియా పంపిణీలో ప్రస్తుత విధానాన్ని మార్చాలని చిలుకూరు మండల కేంద్రంలో కోదాడ జడ్చర్ల జాతీయ రహదారిపై బుధవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కౌన్సిల్ సభ్యులు కస్తూరి సైదులు మాట్లాడుతూ.., రైతులకు యూరియాను అందించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా ఘోరంగా విఫలమయ్యాయని రైతులు యూరియాని తీసుకోవడం కోసం ప్రభుత్వాలు ఒక కొత్తగా యాప్ ని తీసుకువచ్చి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, ఈ యాప్ ద్వారా ఆన్లైన్లో యూరియాను రైతులు బుక్ చేసుకోవడం చాలా సమస్యగా మారిందని ప్రతి రైతుకి మొబైల్ ఫోన్ ఉంటేనే ఇది ఆన్లైన్లో బుక్ చేసుకోవడం సాధ్యం అవుతుందని, వాటిని గురించి అవగాహన లేనటువంటి రైతులు తీవ్రస్థాయిలో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం చిలుకూరు మండల అగ్రికల్చర్ ఆఫీసర్లు వచ్చి సిపిఐ నాయకులతో మాట్లాడి రైతులకు సంబంధించిన యూరియా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎస్.కె సాహెబల్లి, పిల్లుట్ల కనకయ్య, చిలువేరు ఆంజనేయులు, మండవ అచ్చయ్య, దొంతగాని వీరస్వామి, మాధవరపు వెంకటేశ్వర్లు, దొడ్డ నాగేశ్వరరావు, ఇల్లుట్ల కృష్ణయ్య, మాదాసు చిన్న ముత్యాలు, కందుకూరి సైదులు, బాలేబోయిన రవి, సిద్దెల రాములు, కొండా శేషయ్య, కందుకూరి పెద్ద వెంకటేశ్వర్లు, బొడ్డు కాశయ్య, కాసాని అంజయ్య, ఎస్కే జానీ, ప్రశాంతు,శంబయ, తదితరులు పాల్గొన్నారు.





## నిధులను సద్వినియోగించుకోవాలి

- **స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

పీఎం శ్రీ నిధులను పాఠశాలలకు తప్పక వినియోగించు కోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మినీ మీటింగ్ హాల్ లో పీఎం శ్రీ పాఠశాలల కు మంజూరైన నిధులను నిబంధనల మేరకు వినియోగించాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, హెడ్‌మాస్టర్‌లకు, ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమావేశంలో అన్నారు. పీఎం శ్రీ పథకం పరిధిలో ఉన్న పాఠశాలలలో యోగా, సైన్స్, గణిత ప్రయోగాలకు కావలసిన పరికరాల కొనుగోలు, విద్యార్థులకు విజ్ఞాన, పరిశ్రమల అవగాహన పర్యటనలు, కళలు -హస్తకళల వంటి సహ పాఠ్య, పాఠ్యేతర కార్యక్రమాల నిర్వహణ కోసం మంజూరైన నిధులను వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లా లో పి.ఎం శ్రీ కింద 25 పాఠశాలలకు గ్రాంట్ లకు సంబంధించిన బిల్లులు ఆన్‌లైన్ లో సమర్పించాలని, ట్రెజరీ అధికారులు నిబంధనల మేరకు త్వరగా మంజూరు చేయాలని ఆదేశించారు. పీఎం శ్రీ పాఠశాలల్లో అన్ని కార్యక్రమాలు నిర్ణీత కాలవ్యవధిలో సక్రమంగా అమలయ్యేలా ప్రధానోపాధ్యాయులతో నిరంతర సమన్వయం పాటించాలని జిల్లా విద్యాశాఖ అధికారికి సూచించారు.

జిల్లాలో ప్రి మెట్రిక్ ఉపకార వేతనాలకు తక్కువగా దరఖాస్తు చేసుకున్నారని, అర్హత గల వారు అందరినీ దరఖాస్తు చేయించాలని ఆదేశించారు. త్వరలో పాఠశాలల వారీగా సమీక్షిస్తామని తెలిపారు. ప్రతీ పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడిని నోడల్ అధికారిగా నియమించి, యుద్ధ ప్రాతిపదికన ఉపకార వేతనాల దరఖాస్తులు పూర్తి చేయాలని కోరారు. జిల్లాలో ఏటీసీ లు గా మార్చిన ఐటీఐ లలో వచ్చిన కొత్త కోర్సుల గురించి విద్యార్థులకు తెలియజేయాలని అన్నారు. మార్చి నెలలో దేశవ్యాప్తంగా 3 వ తరగతి విద్యార్థులకు జరిపే ఎఫ్ఎల్ఎస్ (ఫౌండేషనల్ లర్నింగ్ స్టడీ) మీద ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి సత్యనారాయణ ట్రెజరీ అధికారి మోహన్, అదనపు సాంఘిక సంక్షేమ అధికారి, మండల విద్యాధికారులు, పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,సెక్టోరియల్ అధికారులు తదితర అధికారులు పాల్గొన్నారు.



## దాతల సహకారంతో డిజిటల్ విద్యాబోధన

**ముద్ర, నడిగూడెం:**

సిరిపురం ప్రాథమిక పాఠశాల2కు జంపాల నిర్మల అందించిన స్మార్ట్ టీవీ ద్వారా బుధవారం డిజిటల్ విద్యాబోధన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బుర్రి. శ్రీనివాసరావు మాట్లాడుతూ డిజిటల్ విద్యాబోధన ద్వారా విద్యార్థులు క్లిష్టమైన అంశాలను కూడా సులభంగా అర్థం చేసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే దాత జంపాల నిర్మల తో పాటు, పాఠశాల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తున్న గ్రామ సర్పంచ్ వెంపటి రామారావు, మాజీ సర్పంచ్ పసుపులేటి జనార్ధన్, గ్రామ పెద్దలు, యువకులు, తల్లిదండ్రులు తదితరులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.సుజాత, వి.జ్యోతి, వై.వెంకన్న, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలను విలువలతో పెంచాలి

- **స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:**

పిల్లలకు చిన్నతనం నుంచే మంచి విలువలు అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి శ్రీజ అన్నారు. బుధవారం స్థానిక కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా మహిళా సాధికారిక కేంద్రం, మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "జాతీయ బాలికల దినోత్సవం" వేడుకకు హాజరైన శ్రీజ మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా "చిన్నారి" అనే ప్రత్యేక కార్యక్రమం రూపొందించి మహిళా, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దాదాపు 1000 విద్యాసంస్థల్లో పర్యటించి పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించామన్నారు. గుడ్ టచ్, బెడ్ టచ్ పై ప్రతి ఇంట్లో పిల్లలకు అవగాహన కనిపించాలని పిల్లలు అన్ని విషయాలు మనతో పంచుకునేలా వారికి స్వేచ్ఛ కల్పించాలన్నారు. ఇంట్లో ఉన్న ఆడ, మగ పిల్లలు సమానంగా ఇతరులను ఎలా గౌరవించాలో నేర్పించాలని, చిన్నతనం నుండి సెల్ ఫోనులు పిల్లలకు అలవాటు చేయవద్దని




సూచించారు. పిల్లలకు ప్రతి దశలోనూ తల్లిదండ్రులు భాగస్వామ్యం కావాలని, చిన్నతనంలోనే పిల్లలను క్రమశిక్షణలో పెట్టాలన్నారు. పిల్లలు మంచి చదువుతోపాటు సంస్కారం కూడా అందించే బాధ్యత మనపైనే ఉందన్నారు. పిల్లలు చిన్నతనం నుండి ఇతరులను గౌరవిస్తూ సమాన భావంతో ఎలా జీవించాలో నేర్పించాలన్నారు. పిల్లలు మన ప్రవర్తన నుంచి చాలా నేర్చుకుంటారని ఇంట్లో మనం సమానత్వం పాటిస్తే అది చూసి పిల్లలు కూడా అలాగే జీవిస్తారని, ఇంట్లో ఉన్న పిల్లల మధ్య ఎలాంటి భేద భావం చూపించకుండా పెంచాలని సూచించారు. అనంతరం గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై చర్చించి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

## 15వ వార్డుకు తమ్మినేని మంగతాయి ఏకగ్రీవం

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:**

ఖమ్మం జిల్లా ఎదలాపురం మున్సిపాలిటీ 15వ వార్డును ఏకగ్రీవంగా కాంగ్రెస్ అభ్యర్థి తమ్మినేని మంగతాయి సొంతం చేసుకున్నారు. ఈ నెల 11 వ తారీకున జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ 32 వార్డులు కలిగి ఉండగా అందులో తెల్దార్ పల్లికి చెందిన 15వ వార్డు నుండి కాంగ్రెస్ పార్టీ తరపున తమ్మినేని మంగతాయి పోటీ చేశారు. నామినేషన్ల గడువు ముగుస్తుండగా బిఆర్ఎస్ మద్దతుతో పోటీ చేసిన సిపిఎం అభ్యర్థి తమ్మినేని విజయ ఎన్నికల పోటీ నుండి వైదొలగడం. పోటీలో ఉన్న ఇతర బిజెపి అభ్యర్థి కూడా పోటీ నుండి తన మినేషన్ ను ఉపసంహరించుకోవడంతో తమ్మినేని మంగతాయి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందం వెల్లివిరిసింది.

## కాంగ్రెస్ ను భారీ మెజారిటీతో గెలిపించాలి

- **ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

భువనగిరి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఓటర్లను కోరారు. బుధవారం పట్టణంలోని 12వ వార్డు పగిడిపల్లిలో శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో కొబ్బరికాయ కొట్టి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పగిడిపల్లి లోని ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూరి విజయలక్ష్మి వెంకటేష్ చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను ఓటు అభ్యర్థించారు. అనంతరం 10వ వార్డు హౌసింగ్ బోర్డ్ లో అభ్యర్థి బింగి నరేష్ గెలుపుకై ప్రచారం చేశారు. 13వ వార్డు ప్రగతి నగర్ లో ఇంటింటి ప్రచారంలో అభ్యర్థి గుర్రాల సంతోషా శ్రీనివాస్ చేతి గుర్తుపై ఓటు వేయాలని కోరారు. 29 వార్డ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోతంశెట్టి మంజూల వెంకటేశ్వర్లు, 19 వార్డ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాకూరి ప్రకాష్ లను గెలుపుకై ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ చైర్మన్ అవైస్ చిస్తీ, పార్టీ పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్, నాయకులు పోత్నాక్ ప్రమోద్ కుమార్, తాంగేళ్లపల్లి రవి కుమార్, నర్సింహా, పడిగేల ప్రదీప్, బిక్షపతి, అమనాథ్ పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
05.02.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ నదీ తీర

అమరావతి (కృష్ణా)
చారిత్రక బౌద్ధ వారసత్వానికి నిలయం.
కృష్ణా నది తీరాన ఆధునిక రాజధాని ప్రణాళిక.







# ఎన్నికల హామీలన్నీ అమలు చేస్తాం

- **మంత్రి వివేక్ వెంకటస్వామి**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

శాసనసభ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం హామీలన్నింటిని అమలు చేస్తామని కార్మిక శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి డా. వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. మెదక్ పట్టణంలో బుధవారం మంత్రి పర్యటించారు. 30వ వార్డులో పార్టీ కార్యాలయం ప్రారంభించారు. 14వ వార్డులో మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని పదేళ్లు మోసం చేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని తెలిపారు. బీఆర్ ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పేరుతో రూ. 65 వేల కోట్లు మింగిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం మంచి భోజనం చేయాలని సన్న బియ్యం ఇస్తోందన్నారు. అందరికి రేషన్ కార్డులు ఇచ్చామని గుర్తు చేశారు. పదేళ్లు బీఆర్ఎస్ ప్రజలను మభ్య పెట్టిందని దుయ్యబట్టారు. అర్హులైన వారందరికి పెన్షన్లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మెదక్ నియోజకవర్గానికి రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేశామని తెలిపారు. మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పిం చామన్నారు. మెడికల్ కాలేజీ ద్వారా ఇక్కడ చదువుకొని డాక్టర్లు కావాలని ఆకాంక్షించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తేనే తాము పైనుంచి కోట్లాడి పనులు చేస్తామన్నారు.

అనంతరం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేండ్లు ఇళ్లు ఇస్తామని ప్రజలను మభ్యపెట్టిందన్నారు. మన ప్రజా ప్రభుత్వం రాగానే అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. గత ప్రభుత్వం ఎన్నికల్లో ఓడిపోతున్నామనే రైతు బంధు వేశారన్నారు. నియోజకవర్గానికి రూ. 200 కోట్ల పనులు చేశామని తెలిపారు. ఏడుపాయలకు గతంలో ఏ ముఖ్యమంత్రి రాలేదన్నారు. మన సీఎం వచ్చి రూ.35 కోట్ల అభివృద్ధి పనులకు నిధులిచ్చారని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మన చర్చికి రూ 29.30 కోట్లు నిధులు ఇచ్చారన్నారు. వరదలు వచ్చినప్పుడు వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడామని తెలిపారు. వరదలు వస్తే సీఎం మెదక్ కు వచ్చి ఇద్దరు ప్రాణాలు కోల్పోయిన వ్యక్తులకు పరిహారం ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిధులన్నీ సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లకు మాత్రమే ఇచ్చారని ఆరోపించారు. హరీష్ రావు ఆటలు చెల్లవన్నారు. ఆయన అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాని ఆరోపించారు. సీఎం రేవంత్ కు పని చేయాలనే కసి ఉందన్నారు. ఈ ఎన్నికలు హరీష్ రావు, హన్మంత్ రావు మధ్య జరుగుతున్న పోటీ అన్నారు. అభివృద్ధిని కాంక్షించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రోహిత్, నాయకులు చంద్రపాల్, బొజ్జ పవన్, వెంకట రమణ, దొంతి నరేష్‌గౌడ్, దొంతి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కు ఓటు వేస్తే కష్టాలే

- **బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఓటు వేసి కష్టాలు తెచ్చుకున్నామని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు ఎం.పద్మాదేవేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని 1,2,3,4 వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థులు చెప్యాల రాజవ్వ సంజీవ్, ఎరుకల ఎల్లం, కొట్టాల లలిత విశ్వం, ధర్మశెట్టి స్వరూపలతో కలిసి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో ఆ తప్పిదం చేయకుండా బీఆర్ఎస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ము ఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు ఎరువులు సకాలంలో అందజేస్తూ ఇబ్బందులు లేకుండా చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూరియా కోసం రైతులు బారులు తీరు తున్నారని చెప్పారు. కేసీఆర్ మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికి నీరు సరఫరా చేసి మహిళల ఇబ్బందులను తీర్చాలని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నీటి సమస్య తీవ్రంగా ఉన్న పట్టించుకునేవారు లేరని ఆరోపించారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నేడు ప్రజలు గుర్తు చేసుకుంటూ బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటేస్తామని అంటున్నారని వెల్లడించారు. ఏ ఇంటికి వెళ్లినా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు పించన్లు రూ.4 వేలు చేస్తానని ఇవ్వలేదని, ఇళ్లు ఇవ్వలేదని, స్కూటీలు రాలేదని, తులం బంగారం ఇవ్వలేదని, మహిళలకు రూ.2,500 ఇస్తామని ఇవ్వలేదని,రూ.5 లక్షల విద్యా గ్యారెంటీ ఇవ్వలేదని, నిరుద్యోగ భృతి రాలేదని ప్రజలు అంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పి, ప్రజలను మోసం చేసి, మభ్యపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖచ్చితంగా ఈ మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షురాలు ఎం.లావణ్య రెడ్డి, మాజీ కౌన్సిలర్లు కొట్టాల విశ్వం, భీమరి కిషోర్, హవేళిఘనాపూర్ సర్పంచ్ మ్యాకల సాయిలు, ఉప్ప సర్పంచ్ వడ్ల రాజు, వార్డు ఇంచార్జులు సుదర్శన్, రవీందర్, మోహన్ నాయక్, నాగరాజు, రామచంద్ర రెడ్డి, శ్రీహరి, సంబశివరావు, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# బీజేపీతో కలిసే ప్రసక్తే లేదు

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



బీజేపీతో కలిసే ప్రసక్తే లేదని మాజీ మంత్రి హరీష్ రావు స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని సాయి బాలాజీ గార్డెన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్ లో పలువురు చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షులు ఎం.పద్మ దేవేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, మల్లిఖార్జున్ గౌడ్, సురేందర్ గౌడ్, మామిళ్ల ఆంజనేయులు, జీవన్ రావు, ప్రభురెడ్డి, బట్టి, లావణ్య రెడ్డి, జుబేర్, సోహైల్, కృష్ణాగౌడ్, సావిత్రి, ఆకిరెడ్డి, నరేందర్, శృతి, గంగమణి, గాయత్రీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏడుపాయల జాతర

- **కలెక్టర్ రాహుల్ రాజ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



ఏడుపాయల వనదుర్గ మాత మహా జాతరను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం హరిత హోటల్ లో ఏడుపాయల వనదుర్గ అమ్మవారి మహాశివరాత్రి సందర్భంగా జాతర ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీఓలు రమాదేవి, మహిపాల్ రెడ్డి, డీఎస్పీ ప్రసన్న కుమార్, ఇతర జిల్లా అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు ఏడుపాయల జాతర వేడుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జాతర సమయానికి సన్నద్ధమయ్యే విధంగా వేగవంతంగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. జాతర నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఎక్కువ బస్సు సర్వీసులు నడపాలన్నారు.

భక్తులకు తాగునీటి సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ పరిసరంలో అపరిశుభ్రత కాకుండా మూడు షిఫ్ట్ లో పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. జాతర సందర్భంగా వైద్య క్యాంపులు ఏర్పాటు చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారుల నోడల్ ఆఫీసర్ల సమన్వయంతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల కోసం ఎక్కడికక్కడ హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని భక్తులు మెచ్చేలా ఏర్పాటు చేసినట్లు వివరించారు.

**150 మంది గజ ఈతగాళ్లు,**

రెండు ఫైర్ డిపార్ట్మెంట్ ద్వారా అగ్నిమాపక వాహనాలు, ద్విచక్ర వాహనం అందుబాటులో ఉండేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా 5 ప్రదేశాల్లో క్యాంప్ లు, నాలుగు 108 అంబులెన్సులు, లక్ష వో ఆర్ ఎస్ ప్యాకెట్ లు, మందులు, అంత్యవసర మందులు,28 మంది డాక్టర్లు, డిప్యూటీ డీఎం హెచ్ ఓ ఆయుష్ డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఇతర వైద్య సిబ్బంది మొత్తం 300 మంది పనిచేస్తారని తెలిపారు.

**భారీ బందోబస్తు..**

నలుగురు డిఎస్పీలు, 23 మంది సీఐలు, 80 మంది ఎస్సైలు, 45 మంది ఏఎస్సైలు, 96మంది హెడ్ కానిస్టేబుళ్లు, 250 మంది కానిస్టేబుళ్లు, 84 మంది మహిళా కానిస్టేబుళ్లు, 234 మంది హోంగార్డులు, 14 మంది మహిళా హోం గార్డులు మొత్తం 829 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీపీఓ యాదయ్య, నాగ్సన్ పల్లి సర్పంచ్ సుశీల, ఆలయ ఈఓ వీరేశం, తహసీల్దార్లు సతీష్ కుమార్, శ్రీనివాస చారి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**అసమానతలు లేని తెలంగాణ నిర్మాణం ..**

వివక్ష, అసమానతలకు తావు లేకుండా సమానత్వంతో కూడిన సమాజాన్ని నిర్మించడమే తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. బుధవారం తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు.



## బీజేపీలో చేరిన స్వతంత్ర అభ్యర్థి

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ మున్సిపాలిటీ 9వ వార్డు స్వతంత్ర అభ్యర్థి బజ్జూరి బిక్షపతి ఎంపీ రఘునందన్ రావు సమక్షంలో బీజేపీలో చేరారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయనకు కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి కరాటే నగేష్ గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాధా మల్లేశం గౌడ్, గడ్డం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ టూరిజం హబ్ ను రాష్ట్రానికి కేటాయించాలి

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**



కేంద్ర బడ్జెట్ లో ప్రకటించిన విధంగా దేశంలో ఏర్పాటు చేయనున్న ఐదు మెడికల్ టూరిజం హబ్ లలో ఒకటి రాష్ట్రానికి కేటాయించాలని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. ఫార్మ రాజధానిగా గుర్తింపు పొందిన హైదరాబాద్ లో ఏర్పాటు చేస్తే రాష్ట్రంలో ప్రజారోగ్యం మెరుగుపడుతుందని అభిప్రాయపడ్డారు.

# సమానత్వంతో కూడిన సమాజాన్ని నిర్మించాలి

- **అడిషనల్ కలెక్టర్ మాధురి**

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**

వివక్ష, అసమానతలకు తావు లేకుండా సమానత్వంతో కూడిన సమాజాన్ని నిర్మించడమే తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం ప్రధాన లక్ష్యమని అడిషనల్ కలెక్టర్ మాధురి పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వర్గానికి సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఫిబ్రవరి 4న తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని అధికారికంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాధురి మాట్లాడుతూ సామాజిక న్యాయం అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని చెప్పారు. దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, మహిళలు, దివ్యాంగుల అభ్యున్నతికి అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన మౌలిక హక్కులు, సమానత్వం, సోదరభావం వంటి విలువలను ప్రతి పౌరుడు ఆచరణలో పెట్టినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా అందరితో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవ ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జగదీష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి విశాలాక్ష్మి, ఇతర జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.




# సీఎం కప్ పోటీలను విజయవంతం చేయాలి

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**



ప్రతిష్టాత్మకమైన సీఎం కప్ పోటీల్లో భాగంగా చేపట్టబోయే నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీలను విజయవంతం చేయాలని వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, క్రీడా సంఘాలను సిద్దిపేట జిల్లా క్రీడాశాఖాధికారి నర్సయ్య కోరారు. బుధవారం స్థానిక జయశంకర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో జరిగిన సన్నహాక సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో క్రీడాకారులను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా, వారిలో దాగి ఉన్న ప్రతిభ పాటవాలను గుర్తించే బాధ్యత వ్యాయామ విద్య ఉపాధ్యాయులపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడలను చాలెంజిగా తీసుకుందన్నారు. అధిక మొత్తంలో నిధులు వెచ్చించి గ్రామీణ ప్రాంతం నుంచి మొదలుకొని రాష్ట్రస్థాయి వరకు పోటీలు నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగానే కలెక్టర్ అందరిని భాగస్వామ్యం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా పీఈటీలపై ఈ బాధ్యత ఎక్కువగా ఉందన్నారు. నియోజకవర్గ పోటీలను ఈ నెల 6 నుంచి మొదలుకొని 10లోగా, జిల్లా స్థాయి పోటీలను 18వ తేదీలోగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ క్రీడా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు బండారుపల్లి శ్రీనివాసులు, దామర మల్లేశం, హరికిషన్, రామేశ్వర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఇలియాస్ రావు, మహేష్, శ్రీనివాస్, సుజాత, సువర్ణ లీల, మాలతి తదితరులు పాల్గొన్నారు.

**దామెర మల్లేశంకు సన్మానం..**

సర్పంచ్ గా గెలుపొందిన హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దామర మల్లేశంను బుధవారం క్రీడా సంఘాలు, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, క్రీడా శాఖ ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ మల్లేశం సామాన్య క్రీడాకారుడిగా తన జీవితాన్ని ప్రారంభించి, మేజర్ గ్రామపంచాయతీ మద్దూరుకు సర్పంచ్ కాగలిగారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాతూరి సుజాత, సువర్ణ లీల, రామేశ్వర్ రెడ్డి, హరికిషన్, బండారుపల్లి శ్రీనివాసులు, ఇలియాస్ రావు, వెంకట నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.




# పాఠశాలల్లో ప్రహరీలు పూర్తి చేయాలి

- **కలెక్టర్ హైమావతి**

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రహరీలు, మరుగుదొడ్ల నిర్మాణాలను యుద్ధ ప్రతిపాదకన పూర్తి చేయాలని కలెక్టర్ హైమావతి పంచాయతీ రాజ్, ఇంజనీరింగ్ శాఖల అధికారులను ఆదేశించారు. బుదవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని ఏంజీ ఎన్ఆర్ఈజీఎస్ కింద నిర్మాణంలో ఉన్న పనులు, ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనుల గురించి ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఆయా గ్రామాల్లో ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ కింద చేపట్టిన పనులు, అంగన్ వాడీ, గ్రామపంచాయతీ భవనాలు, సబ్ సెంటర్, గ్రామ మహిళా సమాఖ్య, ఫుడ్ గ్రైన్ స్టోరేజ్, ఆయా పాఠశాలల్లో ప్రహరీలు, మరుగుదొడ్లు నిర్మాణాలపై వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలల్లో ప్రహరీలు, మరుగుదొడ్ల నిర్మాణానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేసిన ఈజీఎస్ పనులు పూర్తి చేసి, ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థలం ఉన్నవాటికి వెంటనే పనులు మొదలు పెట్టి యుద్ధ ప్రతిపాదకన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ప్రణాళిక ప్రకారం ప్రతి వారం పురోగతి సాధించాలన్నారు. నిర్మాణంలో ఉన్న పనులు ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి పవన్ కుమార్, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
05.02.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ
నదీ తీర ప్రాంతాలు
కర్నూలు (తుంగభద్ర)
రాయలసీమకు ప్రవేశ
ద్వారం.
తుంగభద్ర తీరాన
చారిత్రక ప్రాధాన్యం.








# ఏ విధంగా కేసీఆర్ జాతిపిత..?

- ఫోన్ ట్యాపింగ్ చేసినందుకా..
- భార్యాభర్తల మాటలు విన్నందుకా..
- పోలీసులు మంచోళ్లు కాబట్టే ముసుగులేసి తీసుకెళ్లలేదు
- మున్సిపల్ ఎన్నికల తర్వాత రైతు భరోసా
- తమ పాలన చూసి ఓటేయాలి
- మిర్యాలగూడ సభలో సీఎం రేవంత్ రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణ జాతిపిత అంశంపై కేసీఆర్ కుటుంబం చేస్తున్న ప్రచారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్‌ను జాతిపితగా పిలుచుకుంటామని, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీని తెలంగాణ తల్లిగా గౌరవించుకుంటామని స్పష్టం చేశారు. అసలు ఏ ప్రాతిపదికన మిమ్మల్ని మీరు జాతిపితగా పిలుచుకుంటున్నారు అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడి, భార్యాభర్తల మధ్య జరిగే ప్రైవేట్ సంభాషణలను కూడా విన్న మీకు జాతిపిత అని పిలిపించుకునే నైతిక హక్కు లేదన్నారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ వేదికగా బుధవారం జరిగిన విజయభేరి బహిరంగ సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆయన కుటుంబంపై సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే అది తెలంగాణకు నోటీసులు ఇచ్చినట్లుగా చిత్రీకరించడాన్ని రేవంత్ తప్పుబట్టారు.

**చట్టానికి ఎవరూ అతీతులు కారు..**

రాజకీయాల్లో చట్టానికి ఎవరూ అతీతులు కారని స్పష్టం చేశారు. కేటీఆర్, హరీష్ రావులపై జరుగుతున్న విచారణల గురించి రేవంత్ ప్రస్తావించారు. పోలీసులు ఎవరినైనా విచారణకు పిలిచినప్పుడు సామాన్యులకు ఎలాంటి కఠిన నిబంధనలు వర్తిస్తాయో, వీరికి కూడా అవే వర్తించాలని అధికారులకు సూచించారు. అవసరమైతే నిందితుల ముఖాలకు ముసుగులు వేసి తీసుకెళ్లే ప్రోటోకాల్‌ను కూడా అమలు చేయాలని, కానీ పోలీసులు మంచోళ్లన్నారు.

**మా పాలన చూసి తీర్పు ఇవ్వండి..**

మా ప్రభుత్వ కార్యక్రమాలను చూసి మున్సిపల్ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని కోరారు. తమ ప్రభుత్వం అన్ని వర్గాల కోసం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తీసుకువచ్చిందన్నారు. గత ప్రభుత్వం కనీసం రేషన్ కార్డులు ఇవ్వలేదని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే లక్షలాది మందికి రేషన్ కార్డులు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో మూడు కోట్ల పది లక్షల మందికి సన్న బియ్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రతి ఇంటికి రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెప్పారు.

**రైస్ బౌల్ ఆఫ్ తెలంగాణ మిర్యాలగూడ**

మిర్యాలగూడలో అత్యధికంగా వరి పండుస్తున్నారని తెలిపారు. సన్న వడ్లు పండిస్తే రూ. 500 బోనస్ ఇస్తున్నామని చెప్పారు. బోనస్ తీసుకుంటున్న అత్యధిక లబ్దిదారులు మిర్యాలగూడాలోనే ఉన్నారన్నారు. రాష్ట్రంలో రైతు భరోసా కింద ప్రతి ఎకరాకు రూ. 6 వేలు ఇస్తున్నామన్నారు. ఈసారి మున్సిపల్ ఎన్నికలు ముగియగానే రైతు భరోసా ఇస్తామని సీఎం ప్రకటించారు. రాష్ట్రంలో ఆడబిడ్డలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని సీఎం చెప్పారు.

**మేం కట్టిన ప్రాజెక్టులే..**

నల్గొండ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులన్ని కాంగ్రెస్ పార్టీ కట్టినవే అన్నారు. నల్గొండ జిల్లా పైన కోపంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్ ఎల్ బీసీ ని పూర్తి చేయలేదని ఆరోపించారు. ఎస్ ఎల్ బీసీ ని రెండేళ్లలో పూర్తి చేయడానికి ముందుకు వచ్చామన్నారు. కానీ, అనుకోని ప్రమాదం జరిగి 8 మంది చనిపోయారని చెప్పారు. నల్గొండ జిల్లా ప్రజలు కాంగ్రెస్‌కు అండగా నిలబడాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.




# జక్రాన్‌పల్లి కేజీబీవీలో ఫుడ్ పాయిజన్

- ఎనిమిది మంది విద్యార్థినులకు అస్వస్థత
- ఆర్మూర్ ఆసుపత్రికి తరలింపు

**ముద్ర, నిజామాబాద్:**

నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి కస్తూర్బా గాంధీ కళాశాలలో ఫుడ్ పాయిజన్ ఘటన వెలుగుచూసింది. బుధవారం ఉదయం పాఠశాలలో అందించిన అల్పాహారం వికటించడంతో ఎనిమిది మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. రోజులాగే ఉదయం విద్యార్థినులకు అల్పాహారం వడ్డించారు. టిఫిన్ తిన్న కొద్దిసేపటికే ఎనిమిది మంది విద్యార్థినులకు వాంతులు, కడుపునొప్పి ప్రారంభమయ్యాయి. విద్యార్థినుల పరిస్థితిని గమనించిన పాఠశాల సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను పాఠశాల వాహనంలో వెంటనే ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు వారికి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. విద్యార్థినుల ఆరోగ్యం ప్రస్తుతానికి నిలకడగానే ఉందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు ప్రాథమికంగా వెల్లడించారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనతో ఆసుపత్రికి చేరుకున్నారు. పాఠశాలల్లో ఆహార నాణ్యతపై తనిఖీలు చేపట్టాలని, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. తప్పు ఎక్కడ జరిగిందో అధికారులు విచారణ చేపట్టారు.

# నా సంసారంలో నీ వేలేందుకు..?

- బీఆర్ఎస్ లో ఉన్నానని ఒప్పుకున్నందుకు సంతోషం
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కు జీవన్ రెడ్డి కౌంటర్

**ముద్ర, జగిత్యాల:**

తాను బీఆర్ఎస్ లోనే ఉన్నట్టు ఒప్పుకున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కు జ్ఞానోదయం కలిగినట్లు ఉందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఎద్దేవా చేశారు. బుధవారం జగిత్యాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీ ఫిరాయింపు కేసులో అసెంబ్లీ స్పీకర్ ముందుకు వెళ్లిన సంజయ్ తాను బీఆర్ఎస్ లోనే ఉన్నానని వివరణ ఇచ్చుకోవడం సంతోషకరమన్నారు. తాను ఏ పార్టీలో ఉన్నారో ఆయనకు ఇప్పటికైనా గుర్తుకు వచ్చిందన్నారు. ఇప్పటికైనా క్రమశిక్షణ గల పార్టీ నాయకుడిగా రాజ్యాంగ నిబంధనల మేరకు చట్టసభలకు ఎన్నికైనప్పుడు మన విధులు నిర్వహించాలని సూచించారు. ఇన్నాళ్లూ బీఆర్ఎస్ లో ఉన్న నీవు.. కాంగ్రెస్ లో హల్ చల్ చేశావంటూ సంజయ్ ను నిలదీశారు. నీ సంసారం నువ్వు చేసుకోకుండా నా సంసారంలో ఎందుకు చిచ్చు పెతున్నావంటూ మండిపడ్డారు. స్పీకర్ తీర్పు వచ్చిన తర్వాత అయినా నీ సంసారం నువ్వు చూసుకోవాలన్నారు. కాంట్రాక్టులు, అభివృద్ధి అంటే పక్కింటోడికి కన్నం వేయడం కాదని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డితో కలిసి 20 నెలలు ప్రయాణం చేశారనీ, చేసిన ఒక్క అభివృద్ధి ఏంటో చెప్పు అంటూ ప్రశ్నించారు. అభివృద్ధి కోసమే సీఎంతో ప్రయాణం చేస్తున్నట్టు చెబుతున్నాడని, ఏం చేశాడో ఒక్కటైనా చెప్పాలని నిలదీశారు.





# ఈసెట్ షెడ్యూల్ రిలీజ్

**ముద్ర, హైదరాబాద్:**

రాష్ట్రంలోని ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో లాటరల్ ఎంట్రీలో భాగంగా నేరుగా సెకండియర్ ప్రవేశం కోసం నిర్వహించే టీజీ ఈసెట్ 2026 షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి బుధవారం విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డిప్లొమా, బీఎస్సీ (గణితం) విద్యార్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అయితే ఈ ఏడాది కూడా ఈసెట్ పరీక్ష బాధ్యతను ఉస్మానియా యూనివర్సిటీకి అప్పగించారు. ఈ మేరకు ఈ నెల 9 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తుకు చివరి తేదీ ఏప్రిల్ 18గా నిర్ణయించారు. ప్రవేశ పరీక్షను మే 15న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.500 గా, ఇతర అభ్యర్థులకు రూ.900 గా ఫీజును నిర్ణయించారు. మొత్తం 200 మార్కులకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) నిర్వహించనున్నారు. నిర్ణీత గడువు తర్వాత కూడా ఆలస్య రుసుముతో దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని విద్యామండలి కల్పించనుంది. అర్హత గల విద్యార్థులు మరింత సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్ ecet.tgche.ac.inను సంప్రదించాలని అధికారులు సూచించారు.

# డిమోషన్..



- ఫోన్ ట్యాపింగ్ కేసులో చర్యలు
- ప్రణీత్ రావును సీఐగా డిమోట్

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

ఫోన్ ట్యాపింగ్ కేసులో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నిందితుడు ప్రణీత్ రావును డీఎస్పీ నుంచి సీఐగా డిమోట్ చేసింది. సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉండి, ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న దుగ్యాల ప్రణీత్ రావు హోదాను తగ్గిస్తూ హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనను డీఎస్పీ నుంచి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్థాయికి మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఒక పోలీసు అధికారిని డీఎస్పీ హోదా నుంచి సీఐగా డిమోట్ చేయడం తెలంగాణ చరిత్రలో ఇదే తొలిసారి అని తెలుస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ లో పనిచేసిన ప్రణీత్ రావు నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ నాయకులు, ప్రముఖుల ఫోన్లను ట్యాపింగ్ చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. 2007 బ్యాచ్‌కు చెందిన ప్రణీత్ రావుకు గత కేసీఆర్ ప్రభుత్వం యాక్సిలరేటెడ్ పదోన్నతి కింద డీఎస్పీగా ప్రమోషన్ ఇచ్చింది. అయితే ప్రొబేషన్ కాలంలోనే ఆయన అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆధారాలను ధ్వంసం చేసినట్లు సిట్ విచారణలో తేలింది. దీంతో ఆయనకు గతంలో ఇచ్చిన ఆ పదోన్నతిని రద్దు చేస్తూ హోంశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. సిట్ నివేదిక ప్రాథమిక సమాచారం ప్రకారం 2023 నవంబర్ 15న ఒక్కరోజే దాదాపు 650 ఫోన్లను ట్యాప్ చేసినట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ఎస్ఐబీ కార్యాలయంలోని డేటాను, హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించినట్లు సిట్ భావిస్తోంది. ఈ కేసులో మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావును కూడా సిట్ అధికారులు విచారిస్తున్నారు. తాజా డిమోషన్ ఉత్తర్వులతో ప్రణీత్ రావు ఇకపై ఇన్‌స్పెక్టర్‌గానే కొనసాగనున్నారు.

# మనకు అప్పులు.. వాళ్లకు ఆస్తులు

- కేసీఆర్ కుటుంబంపై విరుచుకుపడ్డ మంత్రి వివేక్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

పదేళ్లలో మనకు అప్పులు మిగిల్చి, కేసీఆర్ కుటుంబం మాత్రం ఆకాశానికి అందేలా సంపాదించుకున్నారని కార్మిక మంత్రి, మెదక్ పార్లమెంట్ ఎన్నికల ఇంచార్జి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. బుధవారం మెదక్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులతో మంత్రి భేటీ అయ్యారు. ఎన్నికల్లో గెలుపు కోసం దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుంట్ల కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుందని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీకి రూ.800 కోట్ల డిపాజిట్లు ఉన్నాయన్నారు. మేఘా కృష్ణారెడ్డి రూ.400 కోట్ల ఎలక్ట్రోలర్ బాండ్లు ఇచ్చారన్నారు.



పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇవ్వలేదన్నారు. కాని నాటి సీఎం కేసీఆర్, ఆయన కొడుకు, కూతురు, అల్లుడు వందల ఎకరాల్లో ఫామ్ హౌస్ లు కట్టుకున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ కవిత చేస్తున్న ఆరోపణల్లో నిజాలు ఉన్నాయన్నారు. అందుకే వాటిని వారెవరూ తిప్పికొట్టడం లేదన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల నుంచి బయట పడేందుకు తమ ప్రభుత్వం ఆర్థిక పరిస్థితిని సరిదిద్దుతున్నట్లు తెలిపారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామన్నారు. త్వరలో వారికి రూ.2,500 ఇచ్చే స్కీమ్ అమలు చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో 80 శాతం కౌన్సిలర్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలవబోతుండగా, మెదక్ లో 90 శాతం గెలుస్తారని నమ్మకం ఉందన్నారు. ఎమ్మెల్యే డా. మైనంపల్లి హన్మంత్ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. మెదక్ మరింత అభివృద్ధి చెందాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్, పార్టీ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, నాయకులు రాగి అశోక్, వెంకటరమణ, బొజ్జ పవన్, ఉప్పల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

**తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ నదీ తీర ప్రాంతాలు**

అలంపూర్ (తుంగభద్ర) జోగులాంబ దేవి శక్తిపీఠం. నదీ సంగమంతో పవిత్రత పొందిన ప్రాంతం.



# ముస్లిం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ ఆరాటం

- ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల నిధుల్లో భారీగా కోతలు
- కమీషన్ల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకలించాలి
- సనాతన ధర్మం మీద దాడులను సహించబోం
- బీజేపీ జాతీయ నేత నితిన్ నబీన్

**ముద్ర, మహబూబ్ నగర్ :**



దేశం, రాష్ట్రంలో ముస్లిం ఓటు బ్యాంకు కోసమే కాంగ్రెస్ నేతలు ఆరాటపడుతున్నారని బీజేపీ జాతీయ నేత నితిన్ నబీన్ ఆరోపించారు. కొన్ని వర్గాలను సంతృప్తిపర్చేందుకే ప్రయత్నం చేస్తున్నారన్న ఆయన కాంగ్రెస్ పాలనలో బలహీన వర్గాలకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల నిధుల్లో భారీగా కోతలు విధిస్తోన్న కాంగ్రెస్.. సర్కార్ వక్ఫ్ బోర్డులను మరింత బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బుధవారం మహబూబ్‌నగర్ లోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన బీజేపీ విజయ సంకల్ప సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పలుచోట్ల హిందూ దేవాలయాలపై బహిరంగంగా దాడులు జరుగుతున్నా ఎవరూ నోరు మెదపట్లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హిందువుల మనోభావాలు దెబ్బతీస్తూ ఆలయ భూములను ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో సనాతన ధర్మం మీద జరుగుతున్న దాడులను ఏమాత్రం సహించబోమన్నారు. గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో అన్నింటా విఫలమైందని ధ్వజమెత్తారు. రైతుభరోసా, రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని అన్నారు. ఎస్సీలు, ఆదివాసీలు, బీసీలను ప్రభుత్వం నిలువునా మోసం చేసిందన్నారు. అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే బీజేపీని గెలిపించాలని నితిన్ నబీన్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కమీషన్ల పేరుతో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధి పనులు, బిల్లుల మంజూరుకు చిన్నచిన్న కాంట్రాక్టర్లు కూడా ఆర్ఆర్ ట్యాక్స్ కట్టాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. ఈ అవినీతి, కమీషన్ల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకలించాలని నితిన్ నబీన్ ప్రజలకు పిలుపునిచ్చారు.

# హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2కు గ్రీన్ సిగ్నల్..

- 76.4 కిలోమీటర్ల విస్తరణకు డీపీఆర్ సిద్ధం
- ఐదు కొత్త కారిడార్లతో నగర రవాణాలో కొత్త అధ్యాయం
- అంచనా వ్యయం రూ. 24వేల కోట్లు
- నాగోల్-శంషాబాద్, రాయదుర్గం–నియోపోలిస్ కీలక మార్గాలు
- పాతబస్తీకి మెరుగైన కనెక్టివిటీ.. ఎంజీబీఎస్–చాంద్రాయణగుట్ట కారిడార్
- మియాపూర్-పటాన్‌చెరు, ఎల్‌బీ నగర్-హయత్‌నగర్ వరకు రెడ్ లైన్ పొడిగింపు
- ఎయిర్‌పోర్ట్ మెట్రోతో ట్రాఫిక్ టెన్షన్‌కు చెక్
- శివార్ల వరకు మెట్రో చేరితే మధ్యతరగతి ఉద్యోగులకు భారీ ఊరట

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) ఖరారు దశకు చేరుకుంది. ఈ దశలో మొత్తం ఐదు కారిడార్లలో 76.4 కిలోమీటర్ల మేర మెట్రో రైలు మార్గాలను నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.24,269 కోట్ల అంచనా వ్యయం అవుతుందని అధికారులు వెల్లడించారు. నగరంలో వేగంగా పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు ఈ రెండో దశ విస్తరణ కీలకంగా మారనుంది. హైదరాబాద్ మెట్రో రైల్ కార్పొరేషన్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, ఫేజ్ 2కు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేయగా, సంబంధిత నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. భూసేకరణ కోసం అవసరమైన 2,787 ఎకరాలకు ఈ ఏడాది జనవరిలోనే రాష్ట్ర మంత్రివర్గం నిధులు మంజూరు చేసింది.

**నాగోల్-శంషాబాద్ కారిడార్..**

నాగోల్ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు 36.6 కిలోమీటర్ల మేర మెట్రో కారిడార్ నిర్మించనున్నారు. ఈ మార్గంలో 24 స్టేషన్లు ఏర్పాటు చేయనుండగా, ఎక్కువ భాగం ఎలివేటెడ్‌గా, 1.6 కిలోమీటర్లు భూగర్భంగా నిర్మించనున్నారు. దీంతో ఎయిర్‌పోర్టుకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేరుకునే అవకాశం కలగనుంది.

**రాయదుర్గం-కోకాపేట్ నియోపోలిస్ కారిడార్..**

రాయదుర్గం నుంచి కోకాపేట్ నియోపోలిస్ వరకు 11.6 కిలోమీటర్ల పొడవున మెట్రో విస్తరణ చేపట్టనున్నారు. మొత్తం 8 స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఐటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలకు ప్రయాణించే వారికి ఇది భారీ ఉపశమనం కలిగించనుంది.



**ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట కారిడార్..**

ఎంజీబీఎస్ నుంచి చంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాన్ని నిర్మించనున్నారు. ఈ కారిడార్‌లో 6 స్టేషన్లు ఏర్పాటు చేయనుండగా, పాతబస్తీ ప్రాంతాలకు మెరుగైన మెట్రో కనెక్టివిటీ అందుబాటులోకి రానుంది.

**మియాపూర్-పటాన్‌చెరు కారిడార్..**

మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు 13.4 కిలోమీటర్ల మేర మరో కారిడార్‌ను విస్తరించనున్నారు. ఈ మార్గంలో 10 స్టేషన్లు నిర్మించనున్నారు. ఇప్పటికే ఉన్న రెడ్ లైన్‌ను ముంబై హైవే వైపు మరింత విస్తరించనున్నారు.

**ఎల్‌బీ నగర్-హయత్‌నగర్ కారిడార్..**

ఎల్‌బీ నగర్ నుంచి హయత్‌నగర్ వరకు 7.1 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరణ చేపట్టనున్నారు. ఈ కారిడార్‌లో 6 స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. విజయవాడ హైవే మీదుగా రెడ్ లైన్‌ను మరింత విస్తరించనున్నారు. ఈ ఐదు కారిడార్లు అందుబాటులోకి వస్తే రోడ్లపై వాహనాల రద్దీ తగ్గడంతో పాటు, హైదరాబాద్ శివార్లలో నివసించే మధ్యతరగతి ఉద్యోగులకు మెట్రో ప్రయాణం మరింత సులభం కానుంది.

# చేవెళ్లలో యువ మహిళా న్యాయవాది హత్య

- బలిగొన్న భూ వివాదం..!
- సొంత అన్న చేతుల మీదుగా చెల్లి హత్య
- ప్రత్యేక బృందాలతో పోలీసుల విచారణ
- కోర్టు విధులు బహిష్కరించిన చేవెళ్ల న్యాయవాదులు
- న్యాయవాదుల భద్రతపై ప్రభుత్వానికి డిమాండ్
- రాష్ట్రవ్యాప్తంగా న్యాయవర్గాల్లో ఆందోళన

**ముద్ర ప్రతినిధి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా :**



హైదరాబాద్ నగర శివారులోని మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లి గ్రామంలో యువ మహిళా న్యాయవాది దారుణ హత్యకు గురికావడం కలకలం రేపింది. స్వప్న (34) అనే న్యాయవాదిని గుర్తుతెలియని దుండగులు గొంతు కోసి హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ప్రారంభించారు. హత్యకు గల కారణాలపై పలు కోణాల్లో విచారణ కొనసాగుతోంది. భూ వివాదం నేపథ్యంలో సొంత అన్నే దాడి చేయించి చెల్లెలు స్వప్నను హత్య చేయించినట్లు పోలీసు వర్గాలు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం.

**చేవెళ్ల కోర్టులో న్యాయవాదుల నిరసన..**

మహిళా న్యాయవాది స్వప్న హత్యను తీవ్రంగా ఖండిస్తూ చేవెళ్ల కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసనకు దిగారు. న్యాయవాదుల భద్రతపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని, నిందితులను త్వరితగతిన అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. యువ న్యాయవాది హత్యతో న్యాయవర్గాల్లో తీవ్ర ఆందోళన నెలకొనగా, న్యాయవాదుల రక్షణ అంశంపై మరోసారి చర్చ ప్రారంభమైంది.

# గండిపేట శివాలయంలో ఘనంగా ప్రథమ వార్షికోత్సవం

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కార్తీక్ రెడ్డి

**ముద్ర, బండ్లగూడ :**

గండిపేటలోని శివాలయంలో ప్రథమ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ కార్తీక్ రెడ్డి ఆలయాన్ని సందర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి, స్వయంగా వడ్డనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్తీక్ రెడ్డితోపాటు నార్సింగి సర్కిల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కె. విష్ణువర్ధన్ రెడ్డి, గండిపేట మాజీ సర్పంచ్ ప్రశాంత్ యాదవ్, మైనారిటీ విభాగం అధ్యక్షుడు ముక్తార్, మాజీ సర్పంచ్ నరసింహ, హరిశంకర్, గణేష్ ముదిరాజ్, మల్లేష్, సుధాకర్, శ్రీకాంత్ రెడ్డి, పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# 12న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

- బీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు టైగర్ కృష్ణయ్య పిలుపు

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

ఈనెల 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని బీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు, వికారాబాద్ జిల్లా అధ్యక్షులు టైగర్ కృష్ణయ్య జిల్లా కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల ప్రాణత్యాగాలతో సాధించుకున్న 39 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి, కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఆయన విమర్శించారు. బడా పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక చట్టాల్లో మార్పులు చేసి, కార్మిక వర్గాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడుకోకపోతే వారి మనుగడకే ప్రమాదం ఏర్పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 12న మిత్రపక్ష కార్మిక సంఘాలన్నింటిని కలుపుకొని అన్ని నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో ర్యాలీలు, సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమ్మెలో జిల్లాలోని అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, మున్సిపల్ కార్మికులు, వైద్యఆరోగ్య ఉద్యోగులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రైవేటు కంపెనీల కార్మికులు, వీఓఏ హమాలీలు, ఆటో డ్రైవర్లు, గిగ్ వర్కర్లు, విద్యుత్ కార్మికులు, గ్రామ పంచాయతీ కార్మికులు, గని కార్మికులు, వీఓఏలు, మెప్మ ఆర్పీలు, ఐకేపీ ఉద్యోగులు తదితర రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.



ఘటనా స్థలంలో రోదిస్తున్న బాధితులు

# స్థలం అప్పగించాలంటూ మహిళల ఆత్మహత్యాయత్నం

- హైదర్‌షాకోట్‌లో భూకబ్జా ఆరోపణలు

**ముద్ర, బండ్లగూడ :**

తమ కష్టార్జితంతో కొనుగోలు చేసిన స్థలాన్ని అక్రమంగా కబ్జా చేస్తున్నారంటూ ఇద్దరు మహిళలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్‌లో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హైదర్‌షాకోట్ గ్రామానికి చెందిన జంగారెడ్డి, పావని రెడ్డి దంపతులు 2019లో 15/1 సర్వే నంబర్ పరిధిలో 306 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. అనంతరం భూమి పూజ నిర్వహించినప్పటికీ ఆర్థిక ఇబ్బందుల కారణంగా నిర్మాణ పనులు ప్రారంభించలేదని తెలిపారు. ఈక్రమంలో 18/4 సర్వే నంబర్‌కు చెందిన స్థలం తమదని చెబుతూ మాజీ కార్పొరేటర్ రవి యాదవ్, సలాం అనే వ్యక్తితో కలిసి పక్కనే ఉన్న భూమిని రెండేళ్ల క్రితం కబ్జా చేసినట్లు బాధితులు ఆరోపించారు. జంగారెడ్డికి చెందిన ప్లాటు ఖాళీగా ఉండటంతో దానిని కూడా అక్రమంగా ఆక్రమించారని తెలిపారు. గత రెండేళ్లుగా తమ స్థలాన్ని అప్పగించాలంటూ వేడుకున్నా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో బుధవారం పావని రెడ్డి, వాణి రెడ్డి అక్కడికి చేరుకుని తమ అత్త ఆకుకూరలు అమ్మి కూడబెట్టిన డబ్బుతో ఈ స్థలం కొనుగోలు చేశామని, తమ స్థలం తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ ఆత్మహత్యాయత్నం చేశారు. స్థానికులు వెంటనే స్పందించి వారిని అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అయితే రవి యాదవ్ పేర్కొంటున్న 18/4 సర్వే నంబర్ భూమి ఆర్మీ ప్రాంతం, ఎర్రగుంట చెరువు, చేవెళ్ల ప్రధాన రహదారి పరిధిలో ఉందని గతంలో కోర్టులు స్పష్టం చేసినట్లు బాధితులు తెలిపారు. గతంలోనూ హైదర్‌షాకోట్ పరిధిలో చెరువు కబ్జాయత్నంతోపాటు నరసింహారెడ్డికి చెందిన స్థలాన్ని కూడా అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. తమ స్థలాన్ని వెంటనే తమకు అప్పగించాలని కోరుతూ బాధితులు రాజేంద్రనగర్ పోలీసులను ఆశ్రయించారు.

# పాత్రికేయుల జీవితాలే పాఠాలు

- పదిమంది ప్రఖ్యాత జర్నలిస్టులపై మోనోగ్రాఫ్‌ల ఆవిష్కరణ
- మీడియా అకాడమీ ఆధ్వర్యంలో చిరు పుస్తకాల విడుదల
- గుత్తా సుఖేందర్‌రెడ్డి, డా. కే. కేశవరావు చేతుల మీదుగా ప్రారంభం
- రానున్న తరాలకు స్ఫూర్తినిచ్చే ప్రయత్నమని వ్యాఖ్యలు
- సోషల్ మీడియాపై జర్నలిస్టుల సమిష్టి చర్చ అవసరం
- మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

**ముద్ర న్యూస్ బ్యూరో, హైదరాబాద్ :**

పాత్రికేయ రంగంలో అనేక ఏళ్లు సేవలందించిన పది మంది ప్రముఖ జర్నలిస్టుల జీవిత విశేషాలు తెలిపే చిరు పుస్తకాలను (మోనోగ్రాఫ్స్) మీడియా అకాడమీ ఆఫ్ తెలంగాణ మంగళవారం విడుదల చేసింది. విధానమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే కేశవరావు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి ఈ మోనోగ్రాఫ్ లను ఆవిష్కరించారు. మీడియా అకాడమీ ఆడిటోరియంలో శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇటీవల మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సహాయం కూడా అందజేశారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ పాత్రికేయ రంగంలో అనేక ఏళ్లు సేవలందించిన ప్రముఖ జర్నలిస్టుల జీవిత విశేషాలు తెలిపే చిరు పుస్తకాలను (మోనోగ్రాఫ్స్) ఆవిష్కరించడం రానున్న తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. నేటి సమాజంలో ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో ఎన్ని మార్పులు వచ్చినా తాను మాత్రం పత్రికలు చదివితేనే సంతృప్తి చెందుతానని గుత్తా సుఖేందర్ రెడ్డి చెప్పారు. సోషల్ మీడియాను కంట్రోల్ చేయడం ఎవరి తరం కాదని, కానీ దీనిపై జర్నలిస్టులందరూ ఎకతాటిపైకి వచ్చి చర్చించడం లేదా వర్క్ షాప్ నిర్వహించి కొంత మార్పునకు నాంది పలకాలన్నారు. డాక్టర్ కె.కేశవరావు మాట్లాడుతూ ప్రముఖుల చరిత్ర తెలిపే పుస్తకం చదవడం సులభమని, కానీ అదే చరిత్రను మోనోగ్రాఫ్ అందించడం అంత సులభం కాదని, అది అక్షర రూపం దాల్చడంలో భాగస్వాములైన అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. సమాజానికి అద్దం పట్టేది వార్త అయితే, ఆ వార్త వెనుక ఉన్న నిజాన్ని వెలికితీసిన జర్నలిస్ట్ భవిష్యత్తు తరాలకు దారి చూపిన వారవుతారన్నారు. . ప్రముఖ పాత్రికేయులైన అబిద్ అలీఖాన్, డి.సీతారామ్, బేతనబొట్ల నాగేశ్వరరావు, పొత్తూరి వెంకటేశ్వరరావు, ఎం.ఎస్.ఆచార్య, ఎ.బి.కె. ప్రసాద్, జి.ఎస్.వరదాచారి, సి.రాఘవాచారి, వి.హనుమంతరావు, ఆదిరాజు వెంకటేశ్వరరావులపై మీడియా అకాడమి ప్రచురించిన 10 చిరు పుస్తకాలను (మోనోగ్రాఫ్స్) ఆవిష్కరణ చేసుకున్నట్లు ఆయన వివరించారు.



**మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సహాయం..**

అక్షరమే ఆయుధంగా క్షేత్రస్థాయిలో పని చేసే జర్నలిస్టులు అకాల మృతి చెందడం బాధాకరమని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు అండగా మేమున్నామని భరోసా ఇచ్చి వారికి ఆర్థిక సహాయం అందజేస్తున్న తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమం అభినందనీయమని కొనియాడారు. మరణించిన జర్నలిస్టుల కోసం ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి ఆర్థిక సహాయంగా లక్ష రూపాయలు మంజూరు చేయడంతోపాటు ఐదేళ్ల పాటు పెన్షన్ సదుపాయం కల్పించడం, మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.



తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ నదీ తీర ప్రాంతాలు

యాదాద్రి (మూసీ)

లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రం. మూసీ నది పరివాహక ప్రాంతంలో ఆధ్యాత్మిక కేంద్రం.





# ఫైనల్‌కి ఢిల్లీ క్యాపిటల్స్

- **ఎలిమినేటర్‌లో గుజరాత్‌పై 7 వికెట్ల విజయం**

వుమెన్స్ ప్రీమియర్ లీగ్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్ మరోసారి ఫైనల్ చేరింది. వడోదర వేదికగా జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌ను 7 వికెట్ల తేడాతో ఓడించింది. ఈ టోర్నీలో ఢిల్లీకి ఇది నాలుగో ఫైనల్. గత మూడు సీజన్లలో టైటిల్ చేజారినా, ఈసారి కప్ సాధించాలనే పట్టుదలతో ఫైనల్‌లో అడుగుపెట్టింది. గురువారం జరిగే తుదిపోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో ఢిల్లీ తలపడనుంది. ఈ మ్యాచ్‌లో జెమీమా రోడ్రిగ్స్ దూకుడైన బ్యాటింగ్‌తో కీలక పాత్ర పోషించింది. 23 బంతుల్లో 41 పరుగులు చేసి ఛేజ్‌ను సులభం చేసింది. బౌలింగ్‌లో చిన్నెల్లే హెన్రీ మూడు వికెట్లు తీయగా, నందని శర్మ రెండు వికెట్లు పడగొట్టింది. ముందుగా బ్యాటింగ్ చేసిన గుజరాత్ జెయింట్స్ 20 ఓవర్లలో 168 పరుగులు చేసింది. బెత్ మూనీ అజేయ అర్ధసెంచరీతో రాణించగా, జార్జియా వేర్‌హమ్ కీలక సహకారం అందించింది. అయితే ఢిల్లీ సమష్టి ప్రదర్శన ముందు గుజరాత్ పోరాటం ఫలితం ఇవ్వలేదు.



# టీ20 ప్రపంచకప్ ఆరంభ వేళ.. భారత జట్టుపై చర్చ

పొట్టి క్రికెట్ మహాసమరమైన ఐసీసీ టీ20 ప్రపంచకప్ ప్రారంభానికి కౌంట్‌డౌన్ మొదలైంది. భారత్-శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీ ఫిబ్రవరి 7న ప్రారంభమవుతోంది. తొలి రోజే పాకిస్తాన్-నెదర్లు లాండ్స్, వెస్టిండీస్-స్కాట్లాండ్, భారత్-అమెరికా జట్ల మధ్య మూడు రోమాంచక మ్యాచ్‌లు జరగనున్నాయి. అన్ని జట్లు ఇప్పటికే తమ వ్యూహాలతో ప్రాక్టీస్‌లో నిమగ్నమై ఉండగా, భారత జట్టు తుదికూర్పుపై అభిమానుల్లో చర్చలు ఊపందుకున్నాయి.ప్రత్యేకంగా ఓపెనింగ్ కాంబినేషన్ పై పెద్ద సందేహం నెలకొంది. సంజూ శాంసన్ ఇటీవల మ్యాచ్‌ల్లో ప్రభావం చూపకపోవడం అతని స్థానం పై అనుమానాలను పెంచింది. ఇదే సమయంలో న్యూజిలాండ్ సిరీస్‌లో చెలరేగిన ఇషాన్ కిషన్ సెంచరీతో తిరిగి ఫామ్‌లోకి రావడం అతనికి అవకాశాలు కలిగించింది. ఈ ఇద్దరిలో ఎవరిని ఎంపిక చేస్తారన్నది కీలక ప్రశ్నగా మారింది.అదే సమయంలో గాయం నుంచి కోలుకున్న తిలక్ వర్మ తిరిగి అందుబాటులోకి రావడంతో జట్టు కూర్పు మరింత క్లిష్టమైంది. ఈ నేపథ్యంలో టీమిండియా స్పిన్నర్ యుజువేంద్ర చహల్ తన అంచనాలను వెల్లడించాడు. అమెరికాతో మ్యాచ్ జరిగితే తాను ఎలాంటి జట్టును ఎంచుకుంటాడో చెప్పాడు. ఆశ్చర్యకరంగా చహల్ జట్టులో ఇషాన్ కిషన్‌కు చోటు ఇవ్వలేదు. అతని ఎంపికలో అభిషేక్ శర్మ-సంజూ శాంసన్ ఓపెనర్లుగా, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ కీలక టాప్ ఆర్డర్ బ్యాటర్లుగా ఉంటారు.మిడిల్ ఆర్డర్‌లో హార్దిక్ పాండ్యా, శివం దూబే, రింకూ సింగ్ కీలక పాత్రలు పోషిస్తారని చహల్ పేర్కొన్నాడు. స్పిన్ విభాగంలో అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి, పేస్ విభాగంలో జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ ఎంపికయ్యారని అతని అంచనా. గ్రూప్-ఎలో భారత్‌తో పాటు పాకిస్తాన్, అమెరికా, నెదర్లాండ్స్, నమీబియా జట్లు ఉండటంతో టీ20 సమరం మరింత ఉత్కంఠభరితంగా ఉండనుంది.



# ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో ఇషాన్ దూకుడు

ఐసీసీ విడుదల చేసిన తాజా టీ20 ర్యాంకింగ్స్‌లో భారత బ్యాటర్ ఇషాన్ కిషన్ భారీ లాభం పొందాడు. 32 స్థానాలు మెరుగుపడి 32వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. న్యూజిలాండ్‌తో జరిగిన ఐదో టీ20లో 43 బంతుల్లో 103 పరుగులు చేసిన ఇన్నింగ్స్ ఈ పురోగతికి కారణమైంది.బ్యాటర్ల జాబితాలో అభిషేక్ శర్మ అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగా, ఇంగ్లాండ్ ఆటగాడు ఫిల్ సాల్ట్ రెండో ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. తిలక్ వర్మను వెనక్కినెట్టి జోస్ బట్లర్ నాలుగో స్థానానికి చేరుకున్నాడు. పాథుమ్ నిశాంక ఒక స్థానం మెరుగై ఐదో ర్యాంక్‌లోకి రాగా, సూర్యకుమార్ యాదవ్ ఆరో స్థానంలో ఉన్నాడు. బౌలర్ల విభాగంలో వరుణ్ చక్రవర్తి అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అర్ష్‌దీప్ సింగ్ రెండు స్థానాలు మెరుగుపడి 14వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా రెండు స్థానాలు తగ్గి 15వ ర్యాంక్‌కు పడిపోయాడు. అక్షర్ పటేల్ మూడు స్థానాలు ఎగబాకి 17వ ర్యాంక్‌ను దక్కించుకున్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో పాకిస్థాన్ ఆటగాడు సైమ్ అయూబ్ ఒక స్థానం మెరుగై అగ్రస్థానానికి చేరుకున్నాడు. హార్దిక్ పాండ్య మూడో ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. శివమ్ దూబె రెండు స్థానాలు మెరుగుపడి 9వ ర్యాంక్‌లో నిలిచాడు.

# భారత్–పాక్ మ్యాచ్ తప్పదన్న అశ్విన్

- **బహిష్కరణపై పాకిస్థాన్ తీరును తప్పుబట్టిన మాజీ స్పిన్నర్**

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తామని పాకిస్థాన్ చేసిన ప్రకటనపై టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తీవ్రంగా స్పందించాడు. పాకిస్థాన్ తీసుకున్న వైఖరే ఈ వివాదానికి కారణమని విమర్శించాడు. నాలుగు-ఐదు రోజుల్లో పరిస్థితి మారుతుందని, భారత్-పాక్ మ్యాచ్ తప్పకుండా జరుగుతుందని స్పష్టం చేశాడు. ఆ మ్యాచ్‌ను తాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని వెల్లడించాడు. ఈ వ్యవహారంపై తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన అశ్విన్, భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకే భారీ నష్టం వాటిల్లుతుందని వ్యాఖ్యానించాడు. బ్రాడ్‌కాస్టర్లు, ఇతర క్రికెట్ బోర్డులు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తాయని తెలిపాడు. ఐసీసీ సమావేశాల్లో ఈ అంశం చర్చకు వస్తుందని, పీఎస్ఎల్‌కు విదేశీ ఆటగాళ్లకు ఎన్ఓసీలు రావడంపైనా ప్రభావం ఉంటుందని అభిప్రాయపడ్డాడు. ఇప్పటికే తటస్థ వేదికల్లో ఇరు జట్లు తలపడుతున్న నేపథ్యంలో మ్యాచ్‌కు నిరాకరణ ఆమోదయోగ్యం కాదని అశ్విన్ పేర్కొన్నాడు. ఇదిలా ఉండగా, భారత్-శ్రీలంక సంయుక్త ఆతిథ్యంతో జరుగుతున్న ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఆదివారం ప్రారంభం కానుంది. 20 జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో భారత్ తమ తొలి మ్యాచ్‌లో అమెరికాతో తలపడనుంది.







# సెమీస్‌లో వైభవ్ తుఫాన్

అండర్-19 ప్రపంచకప్ 2026 సెమీఫైనల్లో టీమిండియా టీనేజ్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ మెరుపులు మెరిపించాడు. అఫ్గానిస్థాన్ నిర్దేశించిన 311 పరుగుల లక్ష్య ఛేదనలో భాగంగా అతడు విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి పెంచాడు. 33 బంతుల్లో 68 పరుగులు చేసిన వైభవ్ ఇన్నింగ్స్‌లో 9 ఫోర్లు, 4 సిక్స్‌లు చోటు చేసుకున్నాయి. తొలి వికెట్‌కు 90 పరుగుల భాగస్వామ్యంతో భారత్‌కు ఆద్యంతం ఉత్సాహాన్ని నింపాడు. క్రీజులో ఉన్నంతసేపూ అన్ని వైపులా షాట్లు ఆడిన వైభవ్ అఫ్గాన్ బౌలింగ్‌ను తలకిందులు చేశాడు. పుల్, ఫ్లిక్, కవర్ డ్రైవ్, ఆన్ డ్రైవ్‌లతో స్కోర్‌బోర్డు వేగంగా కదిలించాడు. 22 పరుగుల వద్ద లభించిన క్యాచ్‌ను ఫీల్డర్ వదిలేయడంతో అతడు మరింత దూకుడు పెంచి 24 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. చివరికి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగినా, అతడి ఇన్నింగ్స్ సెమీఫైనల్‌కు హైలైట్‌గా నిలిచింది

# థాయ్‌లాండ్ మాస్టర్స్‌లో దేవిక సిహాగ్ కు స్వర్ణం

భారత యువ షట్లర్ దేవిక సిహాగ్ అంతర్జాతీయ వేదికపై సత్తా చాటింది. థాయ్‌లాండ్ మాస్టర్స్ టోర్నమెంట్‌లో విమెన్స్ సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుని కెరీర్‌లో తొలి BWF సూపర్-300 ట్రోఫీని తన ఖాతాలో వేసుకుంది. హర్యానాకు చెందిన 20 ఏళ్ల దేవిక ఈ విజయంతో భారత బ్యాడ్మింటన్‌లో మరో ఆశాకిరణంగా నిలిచింది. ఫైనల్లో మలేసియాకు చెందిన గో జిన్ వెతో జరిగిన పోరులో దేవిక పూర్తిగా ఆధిపత్యం చెలాయించింది. తొలి గేమ్‌ను 21-8తో సులువుగా గెలిచిన ఆమె, రెండో గేమ్‌లో 6-3తో ముందంజలో ఉండగా ప్రత్యర్థి గాయం కారణంగా మ్యాచ్ నుంచి తప్పుకోవడంతో టైటిల్ దేవిక ఖాతాలో చేరింది. ఈ విజయంతో ఆమెకు 18,750 డాలర్ల ప్రైజ్‌మనీతో పాటు 7,000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. పీవీ సింధు, సైనా నెహ్వాల్ తర్వాత థాయ్‌లాండ్ సూపర్-300 టైటిల్ నెగ్గిన మూడో భారతీయ క్రీడాకారిణిగా దేవిక గుర్తింపు సాధించింది. టోర్నీ మొత్తం ఒక్క గేమ్ కూడా కోల్పోకుండా విజేతగా నిలవడం విశేషం. విజయం అనంతరం దేవిక మాట్లాడుతూ.. ఇది తన కెరీర్‌లో ప్రత్యేకమైన క్షణమని, ఈ సీజన్‌లో మరిన్ని టోర్నీల్లో మెరుగైన ప్రదర్శన ఇవ్వడమే లక్ష్యమని పేర్కొంది. బెంగళూరులోని పదుకొనే-ద్రవిడ్ సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్‌లో ఉమేంద్ర రాణా వద్ద దేవిక శిక్షణ పొందుతోంది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
05.02.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ నదీ తీర ప్రాంతాలు

హైదరాబాద్ (మూసీ)
చారిత్రక నగరానికి జీవనాడి మూసీ నది.





## వారణాసి' కోసం ఏడాది ముందు నుంచే ప్రీ వర్కౌట్

### సూపర్ స్టార్ మహేష్ బాబు

మహేష్ బాబు–ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ చిత్రం 'వారణాసి'పై అంచనాలు మరింత పెరుగుతున్నాయి. ప్రియాంక చోప్రా కథానాయికగా, పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రతినాయక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.తాజా ఇంటర్వ్యూలో మహేష్ బాబు సినిమా గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. కథ మొదట విన్నప్పుడు ఈ పాత్ర చేయగలనా అనే సందేహం, భయం కలిగిందని చెప్పారు. అయితే రాజమౌళి కథను వివరంగా చెప్పిన తర్వాత ఆ భయాలు పోయాయని తెలిపారు.ఈ చిత్రంలో తన పాత్రకు హుందాతనం కీలకమని, శరీర భాష, నడక, నిలబడే తీరు వరకు ప్రతిదానిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని చెప్పారు. పాత్ర కోసం దాదాపు ఏడాది పాటు శిక్షణ తీసుకున్నానని, అందులో భాగంగా కలరీ వంటి యుద్ధవిద్యను కూడా నేర్చుకున్నానని వెల్లడించారు. ఒక చిన్న షాట్ కోసం ఆరు నెలలు ట్రైనింగ్ చేయాల్సి వచ్చిందని, ఆ షాట్ తెరపై చూసినప్పుడు చేసిన కష్టం విలువైనదిగా అనిపించిందన్నారు.ఈ సినిమాతో తన నడక, బాడీ లాంగ్వేజ్ పూర్తిగా మారిపోయిందని మహేష్ బాబు చెప్పారు.

## అన్ని వేదికల్లో దూసుకుపోతున్న అమైరా దస్తూర్



సహజమైన అందం, విభిన్న పాత్రల ఎంపికతో నటి అమైరా దస్తూర్ భారతీయ సినీ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. హిందీ చిత్రాలతో కెరీర్ ప్రారంభించిన ఆమె, తర్వాత తమిళం, తెలుగు సినిమాల్లోనూ నటిస్తూ బహుభాషా నటిగా నిలదొక్కుకుంది. తెలుగులో వచ్చిన 'హాయ్ నాన్న' చిత్రంలో అమైరా చేసిన పరిపక్వమైన, భావోద్వేగంతో కూడిన పాత్ర ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. కంటెంట్‌కు ప్రాధాన్యం ఉన్న చిత్రంలో ఆమె నటన ప్రత్యేకంగా కనిపించింది. అలాగే తమిళ యాక్షన్ థ్రిల్లర్ 'బఘీరా'లో గ్లామర్‌కు తోడు గాఢత ఉన్న పాత్రతో మరోసారి తన నటన పరిధిని చూపించింది.
సినిమాలతో పాటు డిజిటల్ వేదికలపై కూడా అమైరా చురుగ్గా ముందుకు సాగుతోంది. వెబ్ సిరీస్‌లు, ప్రత్యేక ప్రాజెక్టుల ద్వారా యువ ప్రేక్షకులతో అనుసంధానమవుతూ, దేశీయంగానే కాక గ్లోబల్ స్థాయిలోనూ తన పరిధిని విస్తరిస్తోంది.



## బైకర్‌లో యాంగ్రీ యంగ్ మెన్ నయా అవతార్

### అటిట్యూడ్‌తో ఆకట్టుకుంటున్న రాజశేఖర్

సీనియర్ హీరో డాక్టర్ రాజశేఖర్ వెండితెరపై మళ్లీ పవర్‌ఫుల్ పాత్రతో కనిపించబోతున్నారు. శర్వానంద్ నటిస్తున్న 'బైకర్' చిత్రంలో ఆయన కీలక పాత్రలో నటిస్తున్నట్లు మేకర్స్ వెల్లడించారు. హీరోగా సినిమాలు తగ్గించిన రాజశేఖర్, ఈసారి ఇంటెన్సిటీ ఉన్న క్యారెక్టర్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. పుట్టినరోజు సందర్భంగా విడుదలైన గ్లింప్స్‌లో రాజశేఖర్ 'బుల్లెట్ సునీల్' పాత్రలో కనిపించారు. వింటేజ్ బైక్‌తో పాటు స్టైలిష్ గెటప్, గట్టి డైలాగ్స్ ఆయన పాత్రకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్లింప్స్‌లోని ఒక్క డైలాగ్ కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో రాజశేఖర్ మాజీ మోటోక్రాస్ రేసర్‌గా, శర్వానంద్‌కు మెంటార్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. రేసింగ్ నేపథ్యంతో రూపొందుతున్న ఈ అడ్వెంచర్ డ్రామాలో ఆయన క్యారెక్టర్ కీలకంగా ఉండనుంది. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'బైకర్' చిత్రం ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. సమ్మర్ సీజన్‌ను టార్గెట్ చేస్తూ వస్తున్న ఈ సినిమాలో రాజశేఖర్ కమ్‌బ్యాక్ ప్రధాన ఆకర్షణగా మారనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.




## ఆరెంజ్ లుక్‌లో రుక్మిణి

'కాంతారా'తో గుర్తింపు తెచ్చుకున్న రుక్మిణి వసంత్ తాజా ఫోటోషూట్‌తో మరోసారి ఆకట్టుకుంది. ఆరెంజ్ స్కర్ట్‌లో సింపుల్ yet ఎలిగెంట్ లుక్‌లో కనిపించిన ఆమె, సహజమైన ఎక్స్‌ప్రెషన్స్‌తో నెటిజన్ల దృష్టిని దోచుకుంది. మినిమల్ మేకప్, నేచురల్ స్టైలింగ్ ఆమె అందాన్ని మరింత హైలైట్ చేశాయి. ఈ లేటెస్ట్ స్టిల్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నటనతో పాటు స్టైల్ పరంగానూ తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ను ఏర్పరుచుకుంటున్న రుక్మిణి, ప్రస్తుతం పలు కొత్త చిత్రాలతో బిజీగా ఉన్నట్లు సమాచారం.

## ఠాణా మెట్లెక్కిన ఈషా రెబ్బ



సెలబ్రిటీలను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో ట్రోలింగ్‌లు, అసభ్య వ్యాఖ్యలు రావడం నిత్యకృత్యంగా మారింది. కొందరు వాటిని పట్టించుకోకపోయినా, మరికొందరు చట్టపరమైన చర్యలకు వెళ్తున్నారు. ఇదే క్రమంలో నటి ఈషా రెబ్బ ఓ నెటిజన్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో తాను చేసిన పోస్టుకు ఒక వ్యక్తి అసభ్యకరంగా వ్యాఖ్యానించాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. సంబంధిత అకౌంట్ ఐడీ, కామెంట్ వివరాలను పోలీసులకు అందించడంతో బంజారా హిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రాథమికంగా ఫేక్ అకౌంట్ సృష్టించి ఇలాంటి సందేశాలు పంపినట్టు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.ఇక ఈషా రెబ్బ ఇటీవల 'ఓం శాంతి శాంతి శాంతిః' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. తరుణ్ భాస్కర్ హీరోగా నటించిన ఈ సినిమాకు ఏఆర్ సజీవ్ దర్శకత్వం వహించారు. జనవరి 30న విడుదలైన ఈ చిత్రానికి పాజిటివ్ స్పందన లభించింది.

## ఉస్తాద్ భగత్ సింగ్' డేట్ ఫిక్స్...

**మార్చి 26న వింటేజ్ పవన్ ఎంట్రీ**

'ఓజీ' సక్సెస్ తర్వాత రాజకీయాల్లో బిజీ అయిన పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' విడుదల తేదీ ఖరారైంది. గబ్బర్ సింగ్ తర్వాత హరీష్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా షూటింగ్ పూర్తిచేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉంది. తాజాగా విడుదల చేసిన పోస్టర్‌తో మార్చి 26న థియేటర్లలో విడుదల చేస్తున్నట్టు మేకర్స్ ప్రకటించారు. పోస్టర్‌లో వింటేజ్ పవన్ యంగ్ లుక్, స్టైలిష్ డ్యాన్స్ పోజ్ అభిమానులను ఆకట్టుకుంది. ఇది సినిమాలోని ఇంట్రడక్షన్ సాంగ్‌కు సంబంధించినదని సమాచారం. 'లియో' చిత్రంలోని 'నా రెడీ' తరహా ఎనర్జీతో ఈ పాట ఉండనుందని తెలుస్తోంది. త్వరలోనే ఈ పాటను విడుదల చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన 'దేఖ్ లేంగే సాలా' పాటకు మంచి స్పందన వచ్చింది. గబ్బర్ సింగ్ స్థాయిలో అటిట్యూడ్‌తో పవన్ కళ్యాణ్ కనిపిస్తారని టాక్. మార్చి 26 విడుదల, రామనవమి, వీకెండ్ కలిసి రావడంతో సినిమాపై బాక్సాఫీస్ అంచనాలు భారీగా ఉన్నాయి.



## బాబాయ్ ఫస్ట్.. అబ్బాయి నెక్స్ట్

దర్శకుడు బుచ్చిబాబు మార్గదర్శకత్వంలో రూపొందుతున్న రామ్ చరణ్ చిత్రమైన 'పెద్ది' విడుదల తేదీ మార్చి 27 నుంచి ఏప్రిల్ 30కు వాయిదా పడింది. పవన్ కళ్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' మార్చి 26న రావడంతో, వరుసగా మెగా హీరోల సినిమాలు విడుదలైతే వసూళ్లపై ప్రభావం పడుతుందన్న భావనతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. విడుదల వాయిదాపై సోషల్ మీడియాలో మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల చరణ్–ఉపాసనలకు కవలలు పుట్టిన నేపథ్యంలో నటుడు కొంత విరామం తీసుకున్నారు. జాన్వీ కపూర్ అచ్చమ్మగా కనిపిస్తున్న ఈ ఉత్తరాంధ్ర నేపథ్య స్పోర్ట్స్ డ్రామాకు ఏఆర్ రెహమాన్ సంగీతం ప్రధాన ఆకర్షణ. ఏప్రిల్ చివర్లో ఈ చిత్రం పెద్ద ఎత్తున విడుదల కానుంది.




Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com